మహోన్నత వ్యక్తి ఎన్‌టిఆర్

- మే 28 వరకు జయంత్యుత్సవాలు
- నిమ్మకూరు సభలో చంద్రబాబు

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 251 | విజయవాడ, శుక్రవారం 14 ఏప్రిల్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Friday 14 April 2023 | Rs

అమన్‌కు స్వర్ణం

ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్

లోపలి పేజీలో..

యుపిలో ఎన్‌కౌంటర్

- గ్యాంగ్‌స్టర్ కొడుకు, మరొకరి కాల్చివేత

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో తీవ్ర సంచలనం కలిగించిన ఉమేష్ పాల్ హత్య కేసులో నిందితుడిగా వున్న, గ్యాంగ్‌స్టర్, రాజకీయవేత్త అతిక్ అహ్మద్ కుమారుడు అసద్‌ను ఉత్తరప్రదేశ్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టిఎఫ్) బృందం కాల్చివేసింది. గురువారం నాడు ఝాన్సీలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో మరో నిందితుడు గులామ్‌ను కూడా కాల్చి చంపారు. ఘటనా స్థలంలో వీరు పారిపోయేందుకు ఉపయోగించిన బైక్, ఆధునికమైన విదేశీ తయారీ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఉమేష్ పాల్ హత్య కేసులో వీరిద్దరినీ పట్టుకునేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ సంఘటనపై ప్రత్యేక అదనపు డైరెక్టర్ జనరల్ (శాంతి భద్రతలు) ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ, ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన ఉమేష్ పాల్ హత్య కేసులో అసద్, గులామ్‌లను పట్టుకోవాలనుకున్నామని చెప్పారు. వారిద్దరిపై చెరో రూ.5లక్షల బహుమతి వుందని తెలిపారు. తాజాగా యుపి ఎస్‌టిఎఫ్ బృందంతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో వారు చనిపోయారని పేర్కొన్నారు. డిప్యూటీ ఎస్‌పి నవేందు, విమల్ నేతృత్వంలో యుపి ఎస్‌టిఎఫ్ బృందం ఏర్పడింది. 2005లో అప్పటి బిఎస్‌పి ఎంఎల్‌ఎ రాజు పాల్ హత్య కేసులో ఉమేష్ పాల్ కీలకసాక్షిగా వున్నాడు. రాజు పాల్ హత్య కేసులో అతిక్ అహ్మద్ నిందితుడిగా వున్నాడు. ఉమేష్ పాల్‌ను, ఆయన ఇద్దరు పోలీసు అంగరక్షకులను ఈ ఏడాది ఫిబ్రవరి 24న ప్రయాగ్ రాజ్‌లో ఆయన ఇంటివద్దే కాల్చి చంపారు. ఉమేష్ భార్య జయా పాల్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఫిబ్రవరి 25న కేసు నమోదైంది. ఆ కేసులో అతిక్ అహ్మద్, ఆయన సోదరుడు అష్రఫ్, అసద్, గులామ్ తదితరులున్నారు. మరోవైపు ఉమేష్ పాల్ హత్య కేసుకు సంబంధించి అతిక్ అహ్మద్, ఆయన సోదరుడిని గురువారం కోర్టు ముందు హాజరు పరిచారు.

ఉక్కుపై కేంద్రం వంచన

కొద్ది గంటల్లోనే మాట మార్చిన కేంద్ర సహాయ మంత్రి కులస్తే

ఉదయం : విశాఖ స్టీల్ ప్రైవేటీకరణపై ముందుకెళ్లడం లేదు • **సాయంత్రం :** అది నా ఒక్కడి చేతిలోనే లేదు

ఉద్యమం కొనసాగుతుంది : ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభుత్వం తన వంచనను కొనసాగిస్తోంది. పూటకో మాట.. రోజుకో ప్రకటనతో ప్రజలను, కార్మికులను బిజెపి సర్కారు మరింత గందరగోళానికి గురిచేస్తోంది. కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులస్థే గురువారం ఉదయం వైజాగ్ పోర్టు కళావాణిలో జరిగిన రోజ్‌గార్ మేళా కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'ప్రైవేటీకరణపై ముందుకెళ్లడం లేదు' అని ప్రకటించారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలతో నగరంలోని నోవొటల్‌లో సాయంత్రం జరిగిన చర్చల్లో ప్రైవేటీకరణ చేయబోవడం లేదన్న స్పష్టమైన హామీ మంత్రి ఇవ్వలేదు. కొద్ది గంటల వ్యవధిలోనే ఆయన మాటల్లో మార్పు కనిపించడం బిజెపి అసలు నైజాన్ని వెల్లడించిందని పరిశీలకులంటున్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై వెనక్కి తగ్గేది లేదని, ప్రైవేటీకరణ ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించిన విషయం తెలిసిందే.

విశాఖలో మంత్రి పర్యటన సాగిందిలా...

ప్రధాన మంత్రి రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం పోర్టు కళావాణి ఆడిటోరియంలో కేంద్ర సంస్థల్లో ఉద్యోగులుగా ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేసేందుకు గురువారం కేంద్ర సహాయ మంత్రి కులస్థే విశాఖకు వచ్చారు. పత్రాల పంపిణీ అనంతరం మీడియాతో మాట్లాడుతూ 'వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై ఇప్పటికిప్పుడే ముందుకెళ్లడం లేదు. విభాగాలను బలోపేతం చేస్తాం' అంటూ ప్రకటించారు. దీంతో స్టీల్ ప్లాంట్ కార్మికవర్గం, రెండు తెలుగు రాష్ట్రాల్లోకీ ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా వెళ్లింది. కేంద్ర మంత్రి ప్రకటన ఎంతో కొంత ఉపశమనం కలిగించింది అనుకునేలోపే 'అంతా నా చేతిలో లేదు. నరేంద్ర మోడీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉంది' అని సాయిత్రానికి మాట మార్చారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలతో జరిగిన చర్చల సందర్భంగా కొన్ని ప్రతిపాదనలను పోరాట కమిటీ నేత జె.అయోధ్యరామ్ తదితరులు ఆయన ముందుంచగా పై విధంగా స్పందించారు. దీంతో కార్మికవర్గంలో మళ్లీ అలజడి నెలకొంది.

కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులస్థేతో మాట్లాడుతున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

అసలేం జరిగింది ?

గురువారం మధ్యాహ్నం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, స్టీల్ యూనియన్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మంత్రి మాట మార్చేశారు. ఈ సమావేశంలో విశాఖపట్నం ఎంపీ ఎంవివి సత్యనారాయణ కూడా ఉన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు మాట్లాడుతూ.. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం స్ట్రాటజిక్ సేల్ కింద పెట్టడాన్ని నిలిపివేయాలని, ఇదివరకే ప్లాంట్‌ను అమ్మివేసే దిశగా వేసిన లీగల్ అడ్వైజరీ, ఆస్తుల మదింపు, ట్రాన్సాక్షన్ కమిటీలను రద్దు చేయాలని ప్రతిపాదన చేశారు. ఈ విషయమై మంత్రి 'అంతా నా చేతిలో ఏమీ లేదు. ఢిల్లీలో నేను మాట్లాడతాను. మీరు చేసిన ప్రతిపాదనలు తెలియజేస్తాను' అంటూ చెప్పుకొచ్చారు. కనుక ప్రైవేటీకరణ నుంచి కేంద్రం వెనక్కి వెళ్లడం లేదని స్పష్టమైంది.

తమ పోరాటం కొనసాగుతుందని, కేంద్రం ప్రైవేటీకరణను ఉపసంహరిస్తూ స్పష్టమైన ప్రకటన చేసే వరకూ తమ నిరసనలు కొనసాగుతాయని చర్చల అనంతరం కార్మిక నేతలు స్పష్టం చేశారు. మరోవైపు ప్రజా వంచన ఆపి, స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలుపుతున్నట్టు కేంద్రం స్పష్టంగా ప్రకటించాలని సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లా కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, కె.లోకనాథం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు.

ప్రజావంచన వద్దు : సిపిఎం 2

డాక్టర్ అనిల్ కుమార్

పి.తంగరాజు

నంజేగౌడ

పాండురంగ మవినాకర్

కర్ణాటకలో నాలుగు స్థానాలకు సిపిఎం పోటీ

ప్రజాశక్తి- బెంగళూరు ప్రతినిధి

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో సిపిఎం నాలుగు స్థానాలకు పోటీ చేయనుంది. ఈ మేరకు అభ్యర్థుల జాబితాను ఆ పార్టీ రాష్ట్ర కమిటీ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. బాగేపల్లి స్థానం నుంచి డాక్టర్ అనిల్ కుమార్, కెఆర్ పురం నుంచి నంజేగౌడ, కెజిఎఫ్ నుంచి పి.తంగరాజు, కల్బుర్గీ నుంచి పాండురంగ మవినాకర్‌ను పోటీ చేయనున్నారు.

15న బాగేపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి డాక్టర్ అనిల్ కుమార్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ సందర్భంగా బాగేపల్లిలో జరిగే సభకు సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరుకానున్నారు.

టిడ్కో లబ్ధిదారులకు రూ.21 వేలకోట్ల లబ్ధి

- గృహ నిర్మాణశాఖ సమీక్షలో సిఎం వైఎస్ జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడ్కో ఇళ్ల రూపంలో లబ్ధిదారులకు రూ.21 వేలకోట్ల విలువైన లబ్ధి చేకూర్చామని, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. టిడ్కో ఇళ్లపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. క్యాంపు కార్యాలయంలో గురువారం గృహ నిర్మాణ శాఖపై అధికారులతో సిఎం సమీక్ష నిర్వహించారు. టిడిపి ప్రభుత్వం టిడ్కో ఇంటిని ఒక్క లబ్ధిదారునికీ ఇవ్వలేకపోయిందని, తమ ప్రభుత్వ హయాంలో వాటిని పూర్తి చేస్తూ, మౌలిక సదుపాయాలు కల్పిస్తూ లబ్ధిదారులకు అప్పగిస్తున్నామని జగన్ పేర్కొన్నారు. 2.62 లక్షల మంది లబ్ధిదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేయడం ద్వారా ప్రస్తుత ప్రభుత్వ హయాంలో చేకూరిన లబ్ధి రూ.12,011 కోట్లు అని సిఎం అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు 48,712ఇళ్లు అప్పగించామన్నారు. ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణం, హడ్కోకు రూ.9,044 కోట్లు రుణాలు చెల్లించామన్నారు. ఒక్క రూపాయికే 300 చదరపు అడుగుల ఇళ్లను కేటాయించడం ద్వారా

రూ.10,339 కోట్ల భారాన్ని ప్రభుత్వం భరించిందన్నారు. నిర్మాణాల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడొద్దని స్పష్టం చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో హౌసింగ్ కోసం రూ.10,203 కోట్లు ఖర్చు చేశామని, 2023-24లో రూ.15,810 కోట్లు ఖర్చు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సిఎంకు అధికారులు వివరించారు. గృహ నిర్మాణంపై రాష్ట్రం చేస్తున్న ఖర్చు, కొన్ని చిన్న రాష్ట్రాల బడ్జెట్ కన్నా అధికమని, పేదలందరికీ ఇళ్లు పథకానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనమని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 3,40,741 ఇళ్లు పూర్తయ్యాయని, శ్లాబ్ పూర్తి చేసుకున్న ఇళ్లతోపాటు శ్లాబుకు సిద్ధంగా ఉన్న ఇళ్లు 4,67,551 ఉన్నాయన్నారు. ఈ సమీక్షా సమావేశంలో గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి, ఎపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ దవులూరి దొరబాబు, టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

10,158 కొత్త కేసులు

- పెరుగుతున్న కోవిడ్ పాజిటివిటీ రేటు



ఢిల్లీ : దేశంలో కరోనా కేసుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. 10,158 కోవిడ్ కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ గురువారం ఉదయం విడుదల చేసిన బులెటిన్‌లో పేర్కొంది. గత ఎనిమిది నెలల్లో ఇవే అత్యధికం. కొత్తగా 2,29,958 మందికి పరీక్షలు నిర్వహించామని తెలిపింది. ముందురోజుతో పోల్చితే 30శాతం కేసులు పెరగడం ఆందోళన కలిగించే అంశం. దేశంలో ఇప్పుడు యాక్టివ్ కేసుల సంఖ్య 44,998కి పెరిగింది. మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 4,42,10,127కి చేరింది. రికవరీ రేటు 98.71 శాతంగా నమోదైంది. ఇప్పటివరకూ 220.66 కోవిడ్ వ్యాక్సిన్ డోసులు దేశవ్యాప్తంగా ప్రజలు వినియోగించినట్లు కేంద్రం తెలిపింది. రాబోయే 10-12 రోజుల్లో కేసులు మరింతగా పెరుగుతాయని సంబంధిత వర్గాలు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బిజెపిని సాగనంపి దేశాన్ని కాపాడుకుందాం

- నేటి నుంచి సిపిఎం-సిపిఐ ప్రచార భేరి
- పాల్గొంటున్న ప్రకాశ్ కరత్, బినయ్ విశ్వం
- శ్రీనివాసరావు, రామకృష్ణ వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిజెపి ప్రభుత్వ విద్రోహ పూరిత విధానాలపై రాష్ట్రంలో సిపిఎం-సిపిఐ ఉమ్మడి ప్రచార భేరి శుక్రవారం నుంచి ప్రారంభం కానుందని ఆ పార్టీల రాష్ట్ర కార్యదర్శులు వి శ్రీనివాసరావు, కె రామకృష్ణ వెల్లడించారు. బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా విజయవాడలో ప్రారంభమై రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో మే 1వ తేది వరకు జరుగుతుందన్నారు. ప్రారంభ సభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, సిపిఐ జాతీయ కార్యదర్శి బినయ్ విశ్వం పాల్గొంటారని తెలిపారు. ప్రచార భేరికి సంబంధించిన పోస్టర్‌ను విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో సాగుతున్న బిజెపి అరాచక పాలన ఎప్పుడు పోతుందా అనే భావన ప్రజల్లో ఉందన్నారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి, భావోద్వేగాల ద్వారా మరలా అధికారంలోకి రావాలనే దుష్టప్రయత్నం మోడీ-అమిత్‌షా బృందం చేస్తోందని విమర్శించారు. శాంతియుతంగా, సామరస్యంగా సంతోషంగా ప్రజలు పండుగలు, పబ్బులు జరుపుకునే పరిస్థితి లేకుండా బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలకు విరుద్ధంగా మతం పేరుతో ప్రజల మధ్య ఘర్షణను సృష్టించి దేశాన్ని బలహీన పరుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అదానీ కుంభకోణాన్ని, నరేంద్రమోడీ వైఫల్యాలను పక్కదారి పట్టించేందుకు ఇదంతా చేస్తోందని విమర్శించారు. ఇంత జరుగుతున్నా బిజెపి దుర్మార్గాన్ని సిఎం వైఎస్ జగన్, వైసిపి కనీసం ఖండించడం లేదన్నారు. రాష్ట్రంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలు పాఠశాలల్లో స్వేచ్ఛగా విస్తృతంగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లల మెదళ్లలో మత విద్వేషం నింపుతున్నారని తెలిపారు. రాష్ట్రానికి బిజెపి చేస్తున్న ద్రోహాన్ని ఎండగట్టి, మతసామరస్యాన్ని కాపాడాలని ప్రజలను కోరారు.విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ కాకుండా కాపాడే ఉద్దేశం రాష్ట్రప్రభుత్వానికి లేదని విమర్శించారు. కేంద్రం ముందు నుంచి పొడిస్తే రాష్ట్రప్రభుత్వం వెనక నుంచి పొడుస్తోందన్నారు. ఇది దుర్మార్గమని, దీనిని చాలా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.ప్రైవేటీకరణపై సిఎం

మిగతా 5లో

ప్రచార భేరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు, రామకృష్ణ, చిత్రంలో వెంకటేశ్వర్లు, విల్సన్, వైవి, బాబురావు

మరో నాలుగు రోజులపాటు వడగాలులు !

న్యూఢిల్లీ : వచ్చే మూడు నాలుగు రోజుల్లో ఆంధ్రప్రదేశ్, బీహార్, బెంగాల్‌లోని గంగా నదీ పరీవాహక ప్రాంతాలు, ఒడిషాలలో వడగాలులు వీచే అవకాశం వుందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) గురువారం తెలిపింది. ఏప్రిల్ నుండి జూన్ వరకు దేశంలో పలు ప్రాంతాల్లో సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఈ నెల ప్రారంభంలో వాతావరణ కార్యాలయం అంచనా వేసింది. బెంగాల్‌లోని మారుమూల ప్రాంతాల్లో 17వ తేదీ వరకు, ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్, ఒడిషాల్లో 15వ తేదీ వరకు, బీహార్‌లో 15 నుండి 17వరకు వడగాలులు వీసే అవకాశం వుందని ఐఎండి తెలిపింది. ప్రస్తుతం మధ్య, ఉత్తర భారతంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 40 నుంచి 42 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. పశ్చిమ హిమాలయ ప్రాంతం, ఈశాన్య భారతం, పశ్చిమ బెంగాల్, సిక్కిం, ఒడిషా, కోస్తా ఆంధ్రప్రదేశ్, కేరళల్లో చాలా ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు మూడు నుంచి ఐదు డిగ్రీలు పెరుగుతాయని ఐఎండి తెలిపింది. మైదాన ప్రాంతాల్లో గరిష్ట వేడిమి 40డిగ్రీలకు చేరితే, తీర ప్రాంతాల్లో 37డిగ్రీలకు, కొండ ప్రాంతాల్లో 30డిగ్రీలకు చేరితే వడగాలులు వీస్తున్నాయని ప్రకటిస్తారు. 1901లో గణాంకాలు నమోదు చేయడం ఆరంభించినప్పటి నుండి చూసినట్లైతే 2023లో ఫిబ్రవరి మాసం అత్యంత వేడిమిగా నిలిచింది.

ఇఎస్‌ఐ ఆస్పత్రులూ కేంద్రానికే!

ముందుగా విజయవాడ, కర్నూలు హాస్పిటల్స్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కార్మికులకు, చిరుద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్యారోగ్య సేవలు అందించే కార్మిక బీమా సంస్థ (ఇఎస్‌ఐ) నుంచి రాష్ట్ర ప్రభుత్వం తప్పుకోవాలని యోచిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇఎస్‌ఐ ఆస్పత్రుల నిర్వహణ ఇక ఇఎస్‌ఐ కార్పొరేషనే చూసుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పింది. ఇందుకు సంబంధించిన సమ్మతి పత్రాన్ని ఇచ్చింది. రాష్ట్రంలో ఇఎస్‌ఐకి కేంద్రంగా వున్న గుణదల ఆస్పత్రితోపాటు, కర్నూలులోని నిర్మించనున్న ఆస్పత్రికి బాధ్యతను కూడా దానికే అప్పగించింది.

కేంద్ర కార్మిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఇఎస్‌ఐలోని కార్పొరేషన్ ద్వారా నిర్వహించే ఆస్పత్రుల నిర్వహణ బాధ్యతలను మామూలుగా ఆయా రాష్ట్రప్రభుత్వాలు తీసుకుంటాయి. వైద్యుల నియామకాలు, ఇతర ఉద్యోగుల నియామకాలను రాష్ట్ర ప్రభుత్వమే చూస్తుంది. మందులకు సంబంధించి కార్పొరేషన్ ఇచ్చే నిధులకు కొంత రాష్ట్రం జోడిస్తుంది. ఇఎస్‌ఐ సౌకర్యం ఉన్న కార్మికులు పెద్ద ఆస్పత్రుల్లో చికిత్స పొందినప్పుడు ఇస్‌ఐ సెలవులు ఇస్తుంది. ఆ సెలవుల కాలంలో కొంత జీతాన్నిస్తుంది.

కర్నూలులో 30 పడకల ఆస్పత్రిని నిర్మించేందుకు ఇఎస్‌ఐ కార్పొరేషన్ నిర్ణయించింది. భవిష్యత్తులో దీనిని వంద పడకల ఆస్పత్రిగా ఆధునీకరించేందుకు కూడా నిర్ణయించింది. ఈ ఆస్పత్రిని మీరు నిర్వహిస్తారా, మమ్మల్ని నిర్వహించమంటారా అంటూ 2020 డిసెంబర్‌లోనే రాష్ట్ర ప్రభుత్వానికి ఒక లేఖ రాయగా.. మీరే నిర్వహించుకోండని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తెలియజేసింది.

గుణదల ఆస్పత్రి విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం ఇదే వైఖరితో వుంది. దీనిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చి మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్రం తన లేఖలో కోరింది.

ఇతర ఆస్పత్రులకు సిబ్బంది

గుణదల ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందిని ఇతర ఇఎస్‌ఐ ఆస్పత్రులకు బదలాయించేందుకు రాష్ట్రం ప్రతిపాదనలు కూడా సిద్ధం చేస్తోంది. అయితే వారి సేవలను ఇతర చిన్న ఆస్పత్రుల్లో ఎలా వినియోగించుకుంటారన్నది మాత్రం తెలియడం లేదు. ఇదే సమయంలో ఆస్పత్రిని పూర్తిగా స్వాధీనం చేసుకునే సమయాన్ని ముందుగానే తమకు చెబితే, ఏర్పాట్లు చేసుకుంటామని రాష్ట్ర కార్మికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఇఎస్‌ఐ కార్పొరేషన్‌కు స్పష్టం చేశారు.

రాష్ట్రాల స్థాయిలో సీట్ల సర్దుబాటు

- కూటమి ఏర్పాటేదైనా ఎన్నికల తరువాతే
- నితీష్‌తో భేటీ అనంతరం ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సీట్ల సర్దుబాట్లు రాష్ట్రాల స్థాయిలోనే ఉంటుందని, ఏ కూటమి అయినా ఎన్నికల తరువాతే ఏర్పడుతుందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని ఓడించడమే ధ్యేయమని ఉద్ఘాటించారు. బిజెపి వ్యతిరేక ఓట్లు గరిష్టంగా పోగుపడేలా రాష్ట్రాల స్థాయిలో సీట్ల సర్దుబాటు జరగాలని సిపిఎం కోరుకుంటున్నదని తెలిపారు. ఆయా రాష్ట్రాల్లోని పరిస్థితులను బట్టి సీట్ల కేటాయింపు వుంటుందని, ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నచోట కాంగ్రెస్‌తో సహా అన్ని ప్రతిపక్ష పార్టీలు అవసరమైన రాజీ చేసుకోవాలని సూచించారు. ప్రతిపక్షాల ఐక్య ఉద్యమాన్ని వేగవంతం చేసేందుకు బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ గురువారం నాడిక్కడ సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితో పాటు ఇతర నేతలను కలిశారు. సమావేశం అనంతరం సీతారాం ఏచూరి విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్షాల ఐక్యత కోసం ప్రయత్నాలు ఊపందుకున్నాయని, లౌకిక, ప్రత్యామ్నాయం కోసం చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో రాజకీయ పరిస్థితి నెలకొంటుందని, ఆ నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా సిపిఎం రాజకీయ పొత్తుపై నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. అధికారాన్ని నిలబెట్టుకోవడానికి బిజెపి గరిష్టంగా మత విభజనను సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజల దైనందిన సమస్యల పరిష్కారానికి బిజెపి ప్రభుత్వం దగ్గర ఎలాంటి ప్రణాళిక లేదని, బతుకుతెరువు కోసం వారు పడుతున్న కష్టాల నుంచి దృష్టి మరల్చేందుకు విభజనను తీసుకొచ్చి, ఓట్లు దండుకోవాలని బిజెపి చూస్తోందని మండిపడ్డారు. దీనికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఏకతాటిపై నిలబడాలని, ఇలాంటి కార్యక్రమాలకు సిపిఎం

మిగతా 5లో

ఏచూరి, నితీష్ కరచాలనం

చీకటిలో గ్రామ సచివాలయం

- కరెంటు బిల్లు చెల్లించకపోవడంతో సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - పెళ్లకూరు (తిరుపతి)

తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలోని కానూరు రాజుపాలెం గ్రామ పంచాయతీలోని సచివాలయంలో నెలరోజులుగా కరెంట్ లేదు. నాలుగు నెలలకు సంబంధించిన సుమారు రూ.పదివేల కరెంటు బిల్లు చెల్లించకపోవడంతో విద్యుత్ అధికారులు సరఫరాను నిలిపేశారు. దీంతో నెలరోజులుగా ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వివిధ సర్టిఫికేట్ల కోసం సచివాలయాల చుట్టూ ప్రజలు ప్రదక్షిణ చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి, ఎంపిడిఒ దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయం కాస్త సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో అధికారులు కరెంటు బిల్లును చెల్లించారు. దీంతో విద్యుత్‌ను పునరుద్ధరించారు.

జర్నలిస్టు అక్రిడిటేషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

2023-24 సంవత్సరాలకు రాష్ట్ర స్థాయిలో పాత్రికేయులకు స్టేట్ లెవెల్ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు ప్రక్రియ శుక్రవారం నుంచి మొదలు కానుంది. ఆన్‌లైన్‌లో www.ipr.ap.gov.in ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనరు తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టులు తమ వివరాలతో పాటు యాజమాన్యం సిఫార్సు లేఖ, పాస్‌పోర్టు సైజు ఫొటో, అవసరమైన డాక్యుమెంట్లు పిడిఎఫ్ ఫార్మాట్‌లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రభుత్వం ఇందుకోసం జిఓ నెంబరు 38ని తీసుకొచ్చిందని, జిఓ నెంబరు 40 ద్వారా స్టేట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల నియామకం పూర్తి చేశామన్నారు. మొదటగా రాష్ట్ర స్థాయిలో అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

పర్వీన్ పెన్షన్ ఎందుకు తొలగించారు?

- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సీమ పర్వీన్ పెన్షన్ ఎందుకు తొలగించారని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రశ్నించారు. 90 శాతం వైకల్యంతో బాధపడుతున్న పర్వీన్ పెన్షన్ తొలగించడానికి మనసెలా వచ్చిందని గురువారం ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఇంట్లో 300 యూనిట్లకు మించి విద్యుత్ వాడుతున్నారని తొలగిస్తారా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 18 ఏళ్లు వచ్చినా వైకల్యం కారణంగా తల్లిదండ్రుల చేతులపైనే పెరుగుతున్న ఈ బిడ్డ పెన్షన్ తొలగిస్తారా? అని ప్రశ్నించారు. 300 యూనిట్ల విద్యుత్ వాడారని నిబంధనల పేరుతో పెన్షన్ తొలగించడమే మానవత్వమా? అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాల్లో ఆంక్షలతో కోతలపై సమాధానం చెప్పాలన్నారు. వైకల్యంతో ఉంది ఆమె కాదని, జగన్ తన ప్రభుత్వం అంటూ సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు.

కానిస్టేబుల్ పరీక్ష ప్రశ్నలపై తీర్పు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

పోలీసు కానిస్టేబుల్ పరీక్షలో 8 ప్రశ్నలకు సమాధానాలు తప్పుగా ఇచ్చారని దాఖలైన కేసుల్లో వాదనలు ముగియడంతో తీర్పును హైకోర్టు వాయిదా వేసింది. నిపుణుల కమిటీకి నివేదించడంతోపాటు తమను దేహదారుఢ్య పరీక్షకు అనుమతించేలా రిక్రూట్‌మెంట్ బోర్డుకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ జలగం సహజతోపాటు మరో 79 మంది వేసిన పిటిషన్లను న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు గురువారం విచారణ పూర్తి చేశారు. అకాడమీ పుస్తకాల్లో సమాధానాలకు భిన్నంగా తుది కీ సమాధానాలు ఉన్నాయని, అందువల్ల 8 ప్రశ్నలకు సరైన జవాబు ఏంటో తేలాల్సి వుందని పిటిషనరు వాదించారు. పిటిషనర్లను దేహదారుఢ్య పరీక్షకు అనుమతిస్తే మరికొంత మంది ఇదే విధంగా హైకోర్టుకు వస్తారని పోలీసు నియామక బోర్డు తరపున న్యాయవాది చెప్పారు. అనంతరం హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. మరోవైపు ఎస్ఐ పరీక్ష కీలో సమాధానాలు తప్పుగా ఉన్నాయని దాఖలైన కేసుల్లో తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసు నియామక బోర్డును హైకోర్టు ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

258 మందికి నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి చేతుల మీదుగా రోజ్‌గార్ మేళాలో రిక్రూట్ అయిన 258 మంది సభ్యులకు గురువారం నియామకపత్రాలు అందజేశారు. విజయవాడ రైల్వే ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిఆర్ఎం శివేంద్రమోహన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రజావంచన వద్దు

- స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఆపుతూ కేంద్రం ప్రకటించాలి
- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలను వంచించడం ఆపి వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని నిలిపి వేస్తున్నట్లు కేంద్ర మంత్రివర్గం వెంటనే ప్రకటన చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉక్కు శాఖ మంత్రి ఉదయం మీడియా ముందు ఒక రకంగా మధ్యాహ్నం యూనియన్ నాయకులతో మరో రకంగా చెప్పడం ప్రజల్ని మోసం చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణను పూర్తిగా వెనక్కి తీసుకుంటూ ప్రధానమంత్రి ప్రకటన చేయాలని ముఖ్యమంత్రి ఢిల్లీకి సందేశం పంపాలని కోరారు. విశాఖలోని పోర్ట్ కళావాణి స్టేడియంలో నిర్వహించిన రోజ్ గార్ మేళాలో పాల్గొన్న కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే కేంద్రం స్టీల్ ప్లాంట్‌ను వెంటనే ప్రైవేట్‌పరం చేయాలని భావించడం లేదని, ఆర్.ఐ.ఎన్.ఎల్ ను బలోపేతం చేసే పనిలో ఉన్నామని, స్టీల్ ప్లాంట్ ను పూర్తిస్థాయిలో సామర్థ్యంతో నడిపించే ప్రక్రియ జరుగుతున్నట్లు ప్రకటించారని వివరించారు. మధ్యాహ్నం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం, యూనియన్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మంత్రి ప్రకటనలు మారిపోయాయని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌ను లాభాల్లోకి తీసుకొస్తే ప్రైవేటీకరణ నిలుపుదల అంశం వస్తుందని ప్రకటించారని తెలిపారు. అసలు స్టీల్‌ప్లాంట్‌ను లాభాల్లోకి రానీయకుండా అడ్డుకుంటున్నది కేంద్ర ప్రభుత్వమే అని విమర్శించారు. పూర్తిస్థాయి ఉత్పత్తి జరగనివ్వకుండా కావాలని ప్లాంట్‌ను ఆర్థికంగా దెబ్బతీస్తోందని, బ్లాస్ట్ ఫర్నేస్‌ను మూసివేసిందని పేర్కొన్నారు. ముడిసరుకు, వర్కింగ్ కేపిటల్ ఇవ్వడం లేదని, రైల్వే రేక్స్‌ను అడ్డుకుంటోందని, సొంతగనులు ఇవ్వడం లేదని విమర్శించారు. మరి లాభాలు ఎక్కడ నుండి వస్తాయని ప్రశ్నించారు. దేశంలోని ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్‌లకు కేటాయించినట్లు వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించి, దీనిని పూర్తిస్థాయి సామర్థ్యంతో కేంద్రం నడవనిస్తే ఖచ్చితంగా స్టీల్‌ప్లాంట్ లాభాల బాట పడుతుందని వివరించారు. ఇటీవల పార్లమెంట్ లో ఎంపిలు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై వెనక్కి తగ్గేది లేదని ప్రైవేటీకరణ ప్రక్రియ సాగుతుందని ప్రకటించారని గుర్తుచేశారు. ఒక్కోమంత్రి ఒక్కోసారి ఒక్కోలా ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. ఈ రోజు కేంద్ర మంత్రి ప్రకటనలు ఉదయానికి సాయంత్రానికి మారిపోయాయని తెలిపారు. ఈ ప్రకటనలన్నీ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ఇఒఐ పేరుతో ప్రైవేటీకరణకు మరో తెరలేపిందని తెలిపారు. నేడు కేంద్రమంత్రి ప్రకటనలు ప్రజలను మరోసారి వంచించే ఎత్తుగడగా ఉన్నాయని విమర్శించారు. వీటన్నింటికి కేంద్రప్రభుత్వం తెరదించాలని, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేస్తున్నట్లు కేంద్రమంత్రివర్గం వెంటనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ ప్రక్రియలో భాగంగా వేసిన ట్రాన్సాక్షన్ అడ్వైజరీ కమిటీ, లీగల్ అడ్వైజరీ కమిటీ, అస్సెట్స్ అసిస్‌మెంట్ కమిటీలను రద్దు చేయాలని, అప్పుడే మంత్రి ప్రకటనలోని నిజాయితీ వెల్లడవుతుందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌కి సొంత గనులు కేటాయించి, ప్లాంట్‌ని పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపేందుకు అవసరమైన అన్ని చర్యలు తక్షణమే తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మహోన్నతవ్యక్తి ఎన్‌టిఆర్

- మే 28 వరకు జయంతి ఉత్సవాలు
- నిమ్మకూరు సభలో చంద్రబాబు


నిమ్మకూరులో ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న చంద్రబాబు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

పేదరిక నిర్మూలనకు కంకణబద్ధుడైన నేత ఎన్‌టిఆర్ అని టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. తెలుగుజాతి ఉన్నంత వరకు ఆయనను ప్రజలు గుర్తు పెట్టుకుంటారని తెలిపారు. టిడిపి వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు స్వగ్రామమైన కృష్ణాజిల్లా పామర్రు మండలం నిమ్మకూరులో గురువారం ఆయన శత జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడుతూ.. ఎన్‌టిఆర్ స్ఫూర్తితో పేదలను ఉన్నతస్థానాల్లో నిలిపేందుకు, ఆర్థికంగా గొప్పవాళ్లను చేసేందుకు తన శేష జీవితాన్ని అంకితం చేస్తానని అన్నారు. మే 28 వరకు ప్రపంచంలోని 100 ప్రాంతాల్లో ఎన్‌టిఆర్ జయంతి ఉత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. ఆ రోజున రాజమండ్రిలో భారీ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తొలుత హైదరాబాద్‌లో ఎన్‌టిఆర్ జయంతి ఉత్సవాలు నిర్వహించి, రెండోసారి నిమ్మకూరులో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్‌టిఆర్ సినిమా రంగంలో కొనసాగుతూనే దివిసీమ ఉప్పెన, రాయలసీమ కరువు సందర్భాల్లో సామాజిక బాధ్యతతో ప్రజలను ఆదుకోవడానికి నడుంబిగించారన్నారు. పెత్తందారీ వ్యవస్థ కొనసాగుతున్న రోజుల్లోనే రాజకీయాల్లో పెనుమార్పులు తీసుకువచ్చారన్నారు. పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేశారని, సామాజిక న్యాయం కోసం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు తీసుకు వచ్చారని, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారని గుర్తు చేశారు. కిలో రెండు రూపాయలకు బియ్యం, జనతా వస్త్రాల పంపిణీ, పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణానికి పూనుకున్నారన్నారు. ఈ పథకాలే తర్వాత కాలంలో దేశవ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వచ్చాయన్నారు.

గుడివాడలో హై టెన్షన్

కృష్ణాజిల్లా గుడివాడలో టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు రెండోరోజు పర్యటన ఉద్రిక్తంగా మారింది. గుడివాడలో రోడ్‌షో నిర్వహిస్తుండగా స్థానిక శరత్ థియేటర్ సమీపంలో వైసిపికి చెందిన కొడాలి నాని కార్యాలయం వద్దకు టిడిపి వాహనాలు రాగానే వైసిపి కార్యకర్తలు జై జగన్ నినాదాలతో హోరెత్తించారు. చంద్రబాబు ర్యాలీ వెళ్తుండగా 'జై జగన్.. జై నాని' అంటూ వైసిపి కార్యకర్తలు నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తతంగా మారడంతో పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. ఇరుపార్టీల కార్యకర్తలను చెదరగొట్టారు. కొద్దిసేపటి తర్వాత మరోసారి ఇరువురు కార్యకర్తలు నినాదాలు చేశారు. దీంతో మరోసారి పోలీసులు రంగ ప్రవేశం చేశారు.

పరిస్థితి ఉద్రిక్తతలకు దారితీస్తుండటంతో విజయవాడ నుంచి ప్రత్యేక బలగాలను రంగంలోకి దింపారు. అనంతరం చంద్రబాబు గుడివాడ బహిరంగ సభలో పాల్గొన్ని, ప్రసంగించారు.

విద్యార్థిని హత్యకేసులో యావజ్జీవ శిక్ష

ప్రజాశక్తి - నరసరావుపేట (పల్నాడు జిల్లా)

సంచలనం సృష్టించిన డిగ్రీ విద్యార్థిని కోట అనూష హత్యకేసులో నిందితుడు విష్ణువర్ధన్‌రెడ్డికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. పల్నాడు జిల్లా నరసరావుపేటలో 13వ అదనపు జిల్లా న్యాయస్థానం జడ్జి ఒ.వెంకటనాగేశ్వరరావు గురువారం తీర్పును వెలువరించారు. వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం పమిడిపాడుకు చెందిన మేడం విష్ణువర్ధన్‌రెడ్డి, ముప్పాళ్ల మండలం గొల్లపాడుకు చెందిన కోట అనూష.. నరసరావుపేటలోని ఓ ప్రైవేటు కాలేజీలో డిగ్రీ చదువుతున్నారు. 2021 ఫిబ్రవరి 24న అనూషను విష్ణువర్ధన్‌రెడ్డి నరసరావుపేట - పాలపాడు రోడ్డులోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి గొంతునులిమి హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని కాల్వలో పడేసి మృతురాలి కుటుంబీకులు, స్నేహితులకు సమాచారం ఇచ్చి పరారయ్యాడు. విష్ణువర్ధన్‌రెడ్డిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అనూష కుటుంబీకులు, వామపక్షాలు, టిడిపి, ఎస్ఎఫ్ఐ తదితర విద్యార్థి సంఘాలు అప్పట్లో పెద్దఎత్తున ఆందోళన చేశాయి. విష్ణువర్ధన్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. అప్పటి నుండి కేసు కోర్టులో నడుస్తోంది. రెండేళ్ల తరువాత నరసరావుపేట కోర్టు నిందితుడికి శిక్ష విధించింది. కోర్టు తీర్పుపై అనూష తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విష్ణువర్ధన్‌రెడ్డికి ఉరిశిక్ష పడుతుందని భావించామని, అయితే ఇప్పటికైనా శిక్ష పండిందని పేర్కొన్నారు. పోలీసులు, న్యాయస్థానం నిష్పక్షపాతంగా వ్యవహరించి శిక్ష పడేలా చేశాయని అన్నారు. ఈ కేసును దిశ డిఎస్‌పి యు.రవిచంద్ర దర్యాప్తు చేయగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ పాతూరి మధుసూదనరావు వాదించారు.

పోలీసుల అదుపులో దోషి విష్ణువర్ధన్‌రెడ్డి

సత్కార గ్రహీతలతో కొమ్మినేని శ్రీనివాసరావు

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే, బిఆర్ అంబేద్కర్ జయంత్యుత్సవాల సందర్భంగా మీడియా రంగంలో విశేష కృషి చేసిన జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం, ప్రెస్ అకాడమీ ఆధ్వర్యాన విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో సత్కార కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మినేని మాట్లాడుతూ.. ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన దగ్గర్నుంచి జర్నలిస్టుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి వినూత్న కార్యక్రమాలు చేపట్టామన్నారు. జర్నలిస్టులకు హెల్త్‌కార్డుల విషయంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎం శేషగిరిరావు మాట్లాడుతూ.. జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం కృషి అభినందనీయమన్నారు. సమాజాభ్యుదయం కోసం పాటుపడుతున్న జర్నలిస్టులు ఏవైనా రచనలు చేస్తే రాష్ట్రంలోని అన్ని లైబ్రరీలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎస్ వెంకట్రావు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుకు జర్నలిస్టుల సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. హెల్త్ కార్డులకు సంబంధించిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగానే సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలన్నారు. పెన్షన్ పథకాన్ని వర్తింపజేయాలన్నారు. సీనియర్ జర్నలిస్టులు శాసపు జోగినాయుడు, ఎ యుగంధర్, బడుగు బాలకోటేశ్వరరావు, అవ్వారు గోవిందరాజులు, యేమినేని వెంకటరమణ, అవ్వారు శ్రీనివాసరావు, షేక్ రాజా సాహెబ్, జి విజయకుమార్, పిబిబి విజయ్ చంద్రన్, ఎం ఫ్రాన్సిస్ తదితరులకు సన్మానం చేశారు. సమావేశంలో ప్రెస్ అకాడమీ సెక్రటరీ బాలగంగాధర తిలక్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావు, ఎపిడబ్ల్యుజెఎఫ్ విజయవాడ అధ్యక్షులు కలిమిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

తృణ ధాన్యాల వినియోగంపై అవగాహన

సిఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తృణ ధాన్యాల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. ఐక్యరాజ్య సమితి 2023ను అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో ఈ అంశంపై వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులతో సచివాలయంలో సిఎస్ గురువారం సమీక్షించారు. తృణ ధాన్యాల సాగుకు రాష్ట్రం ఎంతో అనుకూలమైందని, ఈ ఏడాది 1.27 లక్షల హెక్టార్లలో తృణ ధాన్యాలు సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు సిఎస్ తెలిపారు. తృణ ధాన్యాలు సాగు చేసే రైతులకు మద్దతు ధర, మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, తృణ ధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రోత్సాహకాలివ్వాలన్నారు. జిల్లా కేంద్రాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పట్టణాల్లో తృణ ధాన్యాలకు సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళా సంఘాల ద్వారా తృణ ధాన్యాల ఉత్పత్తుల విక్రయానికి మహిళా మార్టుల పేరిట అమ్మకాలను ప్రోత్సహించాలని సెర్ప్ సిఇఒను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో తృణ ధాన్యాల ఉత్పత్తులకు సంబంధించిన ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేయాలని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేదికి సిఎస్ సూచించారు. తృణ ధాన్యాలతో తయారుచేసిన స్నాక్స్‌ను అందించేందుకు ప్రొటోకాల్ విభాగానికి ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. అంతకముందు గోపాలకృష్ణ ద్వివేది పవర్‌పాయిట్ ప్రెజెంటేషన్ ద్వారా రాష్ట్రంలో తృణ ధాన్యాల సాగు ప్రోత్సాహకానికి తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల సంస్థ ఎమ్‌డి వీరపాండియన్, మధ్యాహ్న భోజన పథకం డైరెక్టరు, ఆహారశుద్ధి విభాగం సిఇఒ తదితరులు పాల్గొన్నారు.

'కోడికత్తి'లో జగన్ డ్రామా బట్టబయలు

- మాజీ మంత్రి కెఎస్ జవహర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కోడికత్తి కేసులో జగన్ డ్రామా బట్టబయలైందని మాజీ మంత్రి, టిడిపి నేత కెఎస్ జవహర్ విమర్శించారు. ఎన్నికల్లో లబ్ధి కోసమే పికె డైరెక్షన్‌లో కోడికత్తి దాడి కుట్ర చేసినట్లు ఎన్ఐఎ చార్జిషీట్‌తో తేలిందని గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కుట్రను కప్పిపెట్టుకోవడానికి టిడిపిపై బురద వేశారని పేర్కొన్నారు. అధికారం కోసం దళిత యువకుడిని జైలుపాలు చేసి కుటుంబాన్ని అవస్థలపాలు చేశారని పేర్కొన్నారు. ఎన్ఐఎ అసలు విచారణే జరపలేదంటూ కోర్టుకు వెళ్లకుండా డ్రామాలాడిన జగన్ ఇప్పుడేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

రాష్ట్రాన్ని లూటీ చేస్తున్న జగన్ : నక్కా ఆనంద్‌బాబు

తండ్రి అధికారంలో ఉన్నప్పుడు రూ.లక్షల కోట్లు కొట్టేసిన జగన్.. రాష్ట్రాన్ని మాఫియాలకు అడ్డాగా మార్చి లూటీ చేస్తున్నారని టిడిపి మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు విమర్శించారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాలుగేళ్లలో రూ.లక్షల కోట్లు కొల్లగొట్టిన జగన్ తనకు ఆస్తులు, ఆదాయం, టీవీ ఛానళ్లు, పత్రికా సంస్థలు లేవని నిస్సిగ్గుగా అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. బెంగళూరులో రాజభవనం, హైదరాబాద్‌లో లోటస్‌పాండ్, పులివెందుల, ఇడుపులపాయ, తాడేపల్లి ప్యాలెస్‌లు జగన్‌వి కావా? అని ప్రశ్నించారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతోనే కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతలు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 791వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎఫ్ఎండి, ఎఫ్ఎంసి, సిఎంఇ, ప్లాంట్ డిజైన్, విఎస్‌జిహెచ్, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్ విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు. కెఎస్ఎన్.రావు, వరసాల శ్రీనివాసరావు, ఎన్.రామారావు, మోహన్ కుమార్ మాట్లాడారు. స్టీల్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ (ఇఒఐ)లో ఉక్కు మంత్రిత్వ శాఖ పరిధిలో ఉన్న సెయిల్, ఎన్ఎండిసిలను పాల్గొనేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. తెలంగాణకు చెందిన సింగరేణి కాలరీస్‌కు కూడా అవకాశం కల్పించాలని కోరారు. జెఎస్‌పిఎల్, భూషణ్ స్టీల్, ఎస్సార్ వంటి సంస్థలు బిడ్‌కు రాకుండా చూడాలన్నారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, పూర్తి స్థాయి ఉత్పత్తితో నడపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డిపార్ట్‌మెంట్ల నాయకులు ఐ.శ్రీను, వరసాల బాలకృష్ణ, చలపతి కృష్ణంరాజు, వెంకటరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ వల్లే వెనక్కు : తోట చంద్రశేఖర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ స్టీల్ పరిరక్షణలో రాష్ట్రంలోని టిడిపి, వైసిపి పూర్తిగా వైఫల్యం చెందాయని, భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) రంగప్రవేశంతో కేంద్ర ప్రభుత్వం వెనక్కు తగ్గిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తోట చంద్రశేఖర్ తెలిపారు. తెలంగాణ ఐటి శాఖ మంత్రి కెటిఆర్ కేంద్రానికి లేఖ రాయడంతో పాటు స్టీల్ ప్లాంటు బిడ్డింగ్‌లో పాల్గొనేందుకు చర్యలు తీసుకోవడంతో కేంద్రం వెనక్కు తగ్గిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు.

కేంద్రం ఆధీనంలోనే ఉండాలి : పవన్ కల్యాణ్

విశాఖ ఉక్కు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని, రాష్ట్ర ప్రభుత్వానికి విశాఖ ఉక్కును కాపాడాలనే చిత్తశుద్ధి లేదని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికిప్పుడు ప్రైవేటుపరం చేయాలనుకోవడం లేదని కేంద్ర మంత్రి ప్రకటించడం హర్షణీయమన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం ఎందరో రైతులు తమ భూములను త్యాగం చేశారని, ఇందులో కొందరికి నేటికీ సెటిల్‌మెంట్ కాలేదని తెలిపారు. ఇటువంటి పరిశ్రమపై రాష్ట్ర పాలకులు సైతం శ్రద్ధచూపాలన్నారు. అఖిల పక్షాన్ని కేంద్రం వద్దకు తీసుకెళ్లాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని వాపోయారు.

వర్కింగ్ క్యాపిటల్ సమస్య : జివిఎల్

విశాఖ స్టీల్ ప్లాంటుకు వర్కింగ్ క్యాపిటల్ సమస్య ఉన్నమాట నిజమేనని బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు పేర్కొన్నారు. స్టీల్ ప్లాంటు విషయాన్ని అడ్డుపెట్టుకుని కెసిఆర్ ఆంధ్రాలో అడుగుపెట్టాలని చూస్తున్నారన్నారు. కెసిఆర్ గతంలో చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పినతర్వాతే ఎపిలో రాజకీయాలు చేయాలన్నారు.

హోదా కోసం సిఎం పోరాడాలి

- ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విభజన హామీలు, ప్రత్యేక హోదా కోసం కేంద్రం మెడలు వంచే విధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పోరాటం సాగించాలని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇప్పటికైనా కేంద్రంపై పోరాటం చేపట్టాలని, ప్లాంట్‌ను టేక్ ఓవర్ చేయాలని డిమాండ్ చేశారు. విశాఖలోని విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం రాష్ట్రాన్ని మోసం చేస్తుంటే ఎపి తరపున ఉన్న ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎన్నికలు దగ్గర పడుతున్నా ప్రత్యేక హోదా, విభజన హామీల ఊసే లేదని, విశాఖ కేంద్రంగా రైల్వే జోన్, కెకె లైన్ అభివృద్ధిని పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ సమస్యలపై వామపక్షాలు తప్ప ఏ పార్టీలూ కేంద్రాన్ని ప్రశ్నించడం లేదన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో పదవుల కోసం ఒకరినొకరు తిట్టుకుంటూ అసలైన ప్రజా సమస్యలను గాలికొదిలేస్తున్నారని విమర్శించారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి సిఎం కృషి చేయాలని కోరారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధి నిధుల కోసం అన్ని పార్టీలూ పోరాడాలన్నారు. సమావేశంలో సమితి సహాయ కార్యదర్శి కనిశెట్టి సురేష్‌బాబు, ఆంధ్రా మేధావుల ఫోరం అధ్యక్షులు జి.అప్పలనాయుడు, ఉపాధ్యక్షులు శాస్త్రి పాల్గొన్నారు.

న్యాయవాదులు, మేధావులకు నోటీసులా?

- ఖండించిన సిపిఎం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మార్గదర్శి చిట్‌ఫండ్ ఆడిటర్ అరెస్టును ఖండిస్తూ రౌండ్‌టేబుల్ సమావేశానికి హాజరైన న్యాయవాదులు, మేధావులకు సిఐడి నోటీసులు పంపడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బహిరంగంగా తన అభిప్రాయాలను చెప్పే హక్కు రాజ్యాంగం ప్రతిపౌరునికీ కల్పించిందని తెలిపారు. దానిని కాలదన్నేలా సిఐడి వ్యవహరించడం దారుణమని విమర్శించారు. ప్రభుత్వ దర్యాప్తు సంస్థలే రాజ్యాంగ హక్కులకు భంగం కలిగించడం, అధికార పార్టీ అడుగులకు మడుగులొత్తడం గర్హనీయమన్నారు. 'చార్టెర్డ్ అకౌంటెంటును అరెస్టు చేయడం న్యాయమా' అనే అంశంపై చర్చ జరిగిందన్నారు.

భావ ప్రకటనా స్వేచ్ఛను, రాజ్యాంగం కల్పించిన హక్కును ఉపయోగించుకుని తమ అభిప్రాయాలను ఆయా చర్చా వేదికలో వెల్లడించిన ప్రముఖ న్యాయవాది, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్ర ప్రసాద్, జడా శ్రావణ్‌కుమార్, ఇతర న్యాయవాదులు, చార్టెర్డ్ అకౌంటెంట్లు, జర్నలిస్టులకు సిఐడి నోటీసులు పంపడం అన్యాయం, అప్రజాస్వామికమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్గదర్శి చిట్‌ఫండ్ సంస్థ నిర్వహణలో ఏవైనా లోపాలు జరిగినా, ఫిర్యాదులొచ్చినా చట్టబద్ధంగా విచారణ చేయవచ్చన్నారు. అదే సందర్భంలో రాజ్యాంగం కల్పించిన హక్కులకు భంగం కలిగించేలా సిఐడి వ్యవహరించడం గర్హనీయమని, రాష్ట్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు సిఐడి సాధనం కాకూడదని సూచించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం.. ప్రతిపక్షాలపైనా, ప్రజాస్వామ్యవాదులపైనా కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేసి ఎలా కక్షసాధిస్తున్నదో, ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే విధంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఇటువంటి నిరంకుశ ధోరణులను ప్రజాస్వామికవాదులు, మేధావులు, నిరసించాలని కోరారు.

'టైటిల్ గ్యారెంటీ' సిస్టమ్‌తో అవస్థలే

- చర్చా వేదికలో వక్తల ఆందోళన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

2024 డిసెంబరు నాటికి దేశంలో టైటిల్ గ్యారెంటీ సిస్టిమ్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఓ చట్టం తీసుకురానుందని, అయితే దీనిని సరైనరీతిలో అమల్జేయకపోతే చిన్న, సన్నకారు రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురౌతాయని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలోని గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు - అమలు అనే అంశంపై గురువారం చర్చా వేదిక నిర్వహించారు. ఈ వేదికకు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జల్లి విల్సన్ అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా హాజరైన నల్సార్ యూనివర్శిటీ భూ న్యాయ నిపుణులు సునీల్ కుమార్ మాట్లాడుతూ టైటిల్ గ్యారెంటీ చట్టం అమల్లోకి వస్తే రెవెన్యూ రికార్డులు మాయమవుతాయన్నారు.

ఈ చట్టాన్ని సరిగ్గా ఉపయోగించుకోలేకపోతే సన్న, చిన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారామ్ మాట్లాడుతూ.. భూములను పేదలకు పంచాలని కోనేరు కమిటీ ప్రతిపాదిస్తే.. ప్రభుత్వాలు కార్పొరేట్లకు భూములు పందేరం చేస్తున్నాయన్నారు. భూ సమస్యపై ఐక్య పోరాటాలు కొనసాగిస్తామన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. పేదలకు భూములు పంచే వరకు వామపక్షాల ఉద్యమిస్తాయన్నాయరు. ఈ కార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, ఎఐసిసి సభ్యులు కొలనుకొండ శివాజి, కృష్ణా జిల్లా అధ్యక్షులు కోనేరు తాంతియాకుమారి, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్-5 జోన్ జిఓపై పిటిషన్ ఉపసంహరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజధాని అమరావతిలో ఇతర ప్రాంతాల వారికి ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆర్-5 జోన్ జిఓను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను రైతు ఉట్ల శివయ్య ఉపసంహరించుకున్నారు. రాష్ట్ర హైకోర్టు ఆర్-5 జోన్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకపోవడంతోపాటు ఎటువంటి నిర్ణయం వెలువరించకపోవడంతో ఈ నెల 6న ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను గురువారం జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ బివి నాగరత్నతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. రైతు శివయ్య తరపున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ వాదనలు వినిపించారు. తాము సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసే సమయానికి హైకోర్టు ఉత్తర్వులు విడుదల కాలేదని, ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయని ధర్మాసనానికి తెలియజేశారు. ఈ నెల 19న హైకోర్టులో విచారణ ఉన్నందున పిటిషన్ ఉపసంహరించుకునేందుకు అనుమతివ్వాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ న్యాయవాది విజ్ఞప్తి మేరకు పిటిషన్ ఉపసంహరణకు ధర్మాసనం అనుమతించింది.

విజయనగరంలో ఇద్దరు యువతుల అదృశ్యం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం మహిళా ప్రాంగణం పరిధిలోని స్వధార్ పునరావాస కేంద్రానికి చెందిన ఇద్దరు యువతులు బుధవారం రాత్రి అదృశ్యమయ్యారు. విషయం తెలుసుకున్న ఎపి బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేశలి అప్పారావు, ఐసిడిఎస్ పిడి శాంతకుమారి గురువారం స్వధార్ గృహానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం యువతులు అదృశ్యం కావడంపై విజయనగరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అధికారుల కథనం ప్రకారం... విజయనగరానికి చెందిన సురకా లక్ష్మి (19), ఊళ్ల ఉమామహేశ్వరి (16) స్వధార్ గృహంలో చేరారు. స్వధార్ గృహం ప్రోత్సాహంతో లక్ష్మి ఇటీవల నర్సు ట్రైనింగ్ పూర్తి చేసింది. హైదరాబాద్‌లో ఉద్యోగం కల్పించారు. ఈ నెల 19న వెళ్లి విధుల్లో చేరాల్సి ఉంది. ఈ క్రమంలోనే లక్ష్మి, మహేశ్వరి అదృశ్యమయ్యారు. స్వధార్ గృహానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. గది కిటికీ గ్రిల్స్ ఊడదీసి ఉండడంతో కిటికీలో నుంచి దూకి పారిపోయి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. అదృశ్యమైన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మిర్చి ధరలు పతనం

- క్వింటాలుకు రూ.మూడు వేలు తగ్గుదల

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గత వారం రోజులుగా మిర్చి ధరల పతనం కొనసాగుతోంది. క్వింటాలుకు రూ.మూడు వేల వరకు ధరలు పతనమయ్యాయి. సాధారణ రకాలు కనిష్ట ధర క్వింటాలు రూ. తొమ్మిది వేలు, గరిష్ట ధర రూ. 24 వేలు ఉన్నట్టు అధికారులు తెలిపారు. గత నెలలో ఇదే రకం కనిష్టంగా రూ.12 వేలు, గరిష్టంగా రూ.27 వేలు పలికింది. మేలు రకాలైన తేజ, బాడిగ, దేవనారు డీలక్స్ రకాల ధరలు గత నెలలో కనిష్టంగా రూ.13 వేలు, గరిష్టంగా రూ.30 వేల వరకు పలికాయి. ప్రస్తుతం కనిష్టంగా రూ.9500, గరిష్టంగా రూ.25 వేల వరకు ఉన్నాయి. నాణ్యత లేదనే సాకుతో వ్యాపారులు ధరలు తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు. గుంటూరు మిర్చి యార్డుకు గురువారం 1,25,628 టిక్కిలు రాగా పాత నిల్వలతో కలిపి 1,27,324 టిక్కిలు విక్రయం జరిగాయి. ఇంకా 88,490 టిక్కిలు యార్డులో నిల్వ ఉన్నాయి.కొత్త సరుకు రావడం ప్రారంభం అయిన తరువాత గత మూడు నెలల కాలంలో నాలుగు దఫాలుగా కురిసిన అకాల వర్షాలతో నాణ్యత తగ్గిందని వ్యాపారులు కుంటిసాకు చెబుతున్నారు. విదేశీ ఆర్డర్లు కూడా గత 15 రోజులుగా నిలిచిపోయాయి. మరో 20 రోజుల వరకు ఆర్డర్లు ఉండే అవకాశం లేదని, బంగ్లాదేశ్‌కు ఆర్డర్లు నిలిచిపోవడం వల్ల ఇబ్బంది ఏర్పడిందని మిర్చి యార్డు చైర్మన్ ఎం. సుధాకర్ రెడ్డి తెలిపారు. క్వింటాలుకు రూ.మూడు వేలు వరకు తగ్గినా కనిష్టంగా రూ.14 వేలు, గరిష్టంగా రూ.17 వేలు వస్తుందన్నారు. ఎకరాకు కనీసం 15 క్వింటాళ్ల దిగుబడి రావాలని, క్వింటాలు రూ.20 వేలు తగ్గకుండా ఉంటేనే కొంత వరకు నష్టాల నుంచి బయటపడతామని రైతులు చెబుతున్నారు. ధరలు తగ్గిన నేపథ్యంలో రూపాయికి నాలుగు పైసలు పన్ను, రవాణా చార్జీలు మొత్తంగా క్వింటాలుకు రూ. వెయ్యి ఖర్చు అవుతున్న నేపథ్యంలో సగటు ధరకే కొద్దిమంది రైతులు కల్లాల్లోనే పంటలను విక్రయిస్తున్నారు.

దళితులపై అక్రమ కేసులు రద్దు

- యువగళం యాత్రలో నారా లోకేష్ హామీ

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

లోకేష్ పాదయాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి అఖిలప్రియ, డోన్ నియోజకవర్గ అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి

టిడిపి అధికారంలోకి రాగానే దళితులపై వైసిపి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు రద్దు చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర గురువారం అనంతపురం జిల్లా యాడిగి మండలం దైవాల మరుగు గ్రామం నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలోకి ప్రవేశించింది. ప్యాపిలి మండలం డి రంగాపురం, జక్కసానికుంట్ల, పిఆర్ పల్లె మీదుగా యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చాక దళితవాడలకు శ్మశానానికి స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. దళితులపై దాడులు, అఘాయిత్యాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దళిత యువకుడు సుబ్రహ్మణ్యంను చంపిన ఎమ్మెల్సీ అనంతబాబుకు నేటికీ ఎమ్మెల్సీ పదవి నుండి తొలగించలేదని తెలిపారు. ఎస్సి వర్గీకరణకు టిడిపి ఎప్పుడూ కట్టుబడే ఉంటుందన్నారు. సబ్సిడీ లోన్లను రీ షెడ్యూల్ చేసి, లబ్ధిదారులను ఆదుకుంటామన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్, బెస్ట్ అవెయిలబుల్ స్కీం, విదేశీవిద్య పథకాలను పునరుద్ధరిస్తామని తెలిపారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేసే విధానంపై పార్టీ పెద్దలు చర్చిస్తున్నారని, మ్యానిఫెస్టోలో దీనిపై స్పష్టతనిస్తామని తెలిపారు. గుడిపాడు వద్ద రాత్రి బస చేశారు. ప్యాపిలిలో శుక్రవారం బహిరంగ సభ నిర్వహించనున్నారు.

కాంట్రాక్టు లెక్చరర్లకు రెన్యువల్ ఇవ్వాలి

- ప్రభుత్వ కళాశాలల లెక్చరర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కొనసాగుతున్న కాంట్రాక్టు లెక్చరర్లను రెన్యువల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి ప్రభుత్వ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ కోరింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్‌ను పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతోపాటు బుధవారం కలిశారు. 2019-20 విద్యా సంవత్సరం నుంచి ఆర్థిక సంవత్సరం ప్రారంభం తేదీ నుంచి 10 రోజుల బ్రేక్‌తో 12 నెలలపాటు కాంట్రాక్టు లెక్చరర్ల సేవలను ప్రభుత్వం కొనసాగిస్తోందని తెలిపారు. కళాశాలల్లో పనిభారం, అకడమిక్, అకడమికేతర కార్యకలాపాలను దృష్టిలో పెట్టుకుని 2022-23లో ఒక్కరోజు బ్రేక్‌తో సేవలు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల మూల్యాంకనం రాష్ట్ర వ్యాప్తంగా సాగుతోందని, ఏప్రిల్ మూడు లేదా నాలుగో వారంలో ఫలితాలు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. ఆ తరువాత ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదల కానుందని తెలిపారు. ఈ కార్యక్రమాలన్నిటిలో కాంట్రాక్టు లెక్చరర్లు కీలక భాగస్వాములుగా విధులు నిర్వర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయాలను పరిశీలించి 2023-24 విద్యా సంవత్సరంలో కూడా ఒక్కరోజు బ్రేక్‌తో రెన్యువల్ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కె శ్రీనివాస్, కె శ్రీను, బుల్లా వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నా హక్కులు హరిస్తున్నారు

- సిఎం పర్యటన సందర్భంగా గృహ నిర్బంధానికి ఆదేశాలిచ్చిందెవరు?
- ఏలూరు డిఆర్‌సి సమావేశంలో ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నా హక్కులను కాలరాస్తున్నారు. ఇటీవల దెందులూరులో సిఎం జగన్మోహన్‌రెడ్డి పర్యటనకు వెళ్లకుండా నన్ను గృహనిర్బంధం చేయమని ఆదేశాలిచ్చిన అధికారి ఎవరో చెప్పాలి' అంటూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ డిమాండ్ చేశారు. గురువారం ఏలూరు డిఆర్‌సి (జిల్లా సమీక్షా కమిటీ) సమావేశం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పినిపే విశ్వరూప్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ.. సిఎం పర్యటనకు తనను అధికారికంగా ఆహ్వానించారని, ప్రొటోకాల్‌లో తన పేరు చేర్చారని, అయితే ఆ పర్యటనకు వెళ్లనీయకుండా ముందురోజు రాత్రి నుంచి గృహ నిర్బంధం చేశారని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులకు ఫోన్ చేసినా, మెసేజీలు పెట్టినా సమాధానం రాలేదన్నారు. తనను గృహనిర్బంధం చేయాలని ఏ అధికారి ఆదేశాలిచ్చారో చెప్పాలని కోరారు. ఈ సమస్యను శాసనమండలి ప్రివిలేజ్ కమిటీలోనూ లేవనెత్తనున్నట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద 36 మీటర్ల నీటిమట్టానికే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 90 శాతానికిపైగా గ్రామాలు మునిగిపోయాయన్నారు. కాంటూరు లెక్కలు శాస్త్రీయంగా లేవని స్పష్టమవుతుందన్నారు. ముంపునకు గురైన గ్రామాలన్నింటినీ 41.15 కాంటూరు పరిధిలో చేర్చి ఆర్అండ్ఆర్ పరిహారం అందించాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తిచేయడంతోపాటు, భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలన్నారు. ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గ్రామాలు, పట్టణాల్లో తాగేందుకు తాగునీరు లేదని, గోదావరి నుంచి పైప్‌లైన్ ద్వారా తాగునీరు అందిస్తామని చెప్పిన వాటర్‌గ్రిడ్ పథకం ఏమైందని ప్రశ్నించారు.

అబద్ధాలకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్

- ఎమ్మెల్యే పేర్ని నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నమ్మకానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రాండ్ అంబాసిడర్ అయితే, అబద్ధాలకు, వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే మంత్రి పేర్ని నాని వ్యాఖ్యానించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని అన్నారు. మచిలీపట్నంకు ఔటర్‌రింగ్ రోడ్డు, సాఫ్ట్‌వేర్ కంపెనీ అన్నావని, ఏమి చేశావని ప్రశ్నించారు. మచిలీపట్నంలో పర్యటించే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. త్వరలో బందరు పోర్టు పనులకు సిఎం జగన్ శంకుస్థాపన చేస్తారని, పనులను శరవేగంగా చేపడతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అప్పులపై అవాస్తవాలు మాట్లాడటం తగదన్నారు.

VIJAYAWADA MUNICIPAL CORPORATION

'E' Procurement Notice No.02/VMC/CDB/2023-24, Dt.13-04-2023

Arrangements for Eid-Namaz on eve of RAMZAN, Roads, Widening and Improvement of Pathpadu Road under DMFT Grant, Housing, GGMP, Drains, Steps, water supply, RCC, Repairs, Greenery, Community wall, Culverts, Slabs, RFP for appointment Agency Public toilets (109works)-Est. Amount.2736.97Lakhs.

All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of

Further details and any corrigendum can be seen @ www.tender.apeprocurement.gov.in.

S/d- For COMMISSIONER

'షార్'లో కార్మిక హక్కులు రద్దు

- యూనియన్లు పెట్టరాదంటూ హుకుం
- ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సతీష్ థావన్ స్పేస్ సెంటర్ (శ్రీహరికోట షార్)లో యూనియన్లు ఉండరాదంటూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. యాజమాన్యం చెప్పిందే వేదంగా పనిచేయాలి తప్ప, హక్కులు అంటూ పోరాటాలు చేయకూడదంటూ హుకుం జారీ చేసింది. ఈనెల ఆరో తేదీన కేంద్రం విడుదల చేసిన ఉత్తర్వులు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. ఈ ఉత్తర్వులపై కార్మిక నేతలు కోర్టుకు వెళ్లడంతో మే 16 వరకు స్టే ఇచ్చింది.

ఇస్రోలోని 11 సెంటర్లలో 15వేల మంది సిబ్బంది పనిచేస్తున్నారు. తిరుపతి జిల్లా శ్రీహరికోటలో 2,050 మంది ఉద్యోగులు ఉన్నారు. రూ. 33,500పైగా జీతం పొందే ఆఫీసు గ్రేడ్‌లో 850 మంది ఉద్యోగులు ఉన్నారు. మిగిలిన 1200 మంది సిబ్బంది రెండు యూనియన్లలో సభ్యులుగా ఉన్నారు. గుర్తింపు యూనియన్ అయిన షార్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) 600 పైగా సభ్యత్వం ఉంది. ప్రతి రెండేళ్లకోసారి యూనియన్లకు గుర్తింపు ఎన్నికలు జరుగుతాయి. జాయింట్ కౌన్సిల్ మెంబర్స్ ఆధ్వర్యంలో ఏడాదికి రెండుసార్లు డిపార్టుమెంట్ కౌన్సిల్ బెంగళూరులో జరుగుతుంది. ఇందులో 11 సెంటర్ల నుంచి ఎంపికైన 32 మంది జాయింట్ కౌన్సిల్ మెంబర్స్ ఉంటారు. ఇస్రో ఛైర్మన్ అధ్యక్షతన ఆర్థిక సమస్యలు, ఉద్యోగోన్నతులు, ఇతరత్రా సౌకర్యాలపై బెంగళూరులో జరిగే కౌన్సిల్లో చర్చించడం ఆనవాయితీగా వస్తోంది. బెంగళూరు, అహ్మదాబాద్, శ్రీహరికోట, త్రివేంద్రం, హైదరాబాద్, ఛండీగర్, హసన్ తదితర 11 సెంటర్ల నుంచి ఉద్యోగ కార్మికుల పక్షాన కౌన్సిల్ మెంబర్లు ఈ సమావేశంలో పాల్గొంటారు. అయితే కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఇస్రో యాజమాన్యం 'షార్'లో యూనియన్లు పెట్టరాదంటూ ఈనెల 6న 148/2023 ఉత్తర్వులను షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్ జారీ చేశారు. అధికార సంఘానికి ఇచ్చిన ఆఫీసును, ఫర్నీచర్‌ను, ఇతరత్రా సౌకర్యాలను యాజమాన్యానికి అప్పగించాలని ఉత్తర్వులో పేర్కొంది. ఇకపై ఎంప్లాయీస్ గ్రీవెన్స్‌సెల్ ఆధ్వర్యంలోనే కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామంటూ యాజమాన్యం పేర్కొంది.

హక్కులు కాలరాయడమే

యూనియన్లను రద్దు చేయడం అంటే కార్మిక హక్కులను కాలరాయడమే. వెంటనే ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలి. .

మునిరాజా, షార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు

ర్యాలీ చేపడుతున్న డివైఎఫ్ఐ నాయకులు, నిరుద్యోగులు, విద్యార్థులు

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, మెగా డిఎస్‌సి విడుదల చేయాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగులు గురువారం విజయనగరంలో ర్యాలీ నిర్వహించారు. కోట జంక్షన్ నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయ కూడలి వరకు ర్యాలీ చేశారు. అనంతరం అక్కడ మనవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరీష్, రుద్ర ప్రసాద్ మాట్లాడుతూ... జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు నిరుద్యోగులకు ప్రతి ఏటా జనవరిలో జాబ్ కేలండర్ విడుదల చేస్తామని, మెగా డిఎస్‌సి ప్రకటిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్లైనా ఇప్పటివరకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని, మెగా డిఎస్‌సి ప్రకటించకుండా నిరుద్యోగ జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 50 వేలకుపైగా టీచర్ పోస్టులు ఖాళీలున్నా వాటిని భర్తీ చేయడం లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. రైల్వేశాఖలో మూడు లక్షలకుపైగా ఖాళీలున్నా ఉద్యోగావకాశాలు కల్పించలేదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నూతన జాబ్ కేలండర్ ప్రకటించి, మెగా డిఎస్‌సి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాము, జిల్లా కమిటీ సభ్యులు సౌమ్య, రవి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం ఎయిర్‌పోర్టును త్వరగా పూర్తి చేయండి

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్‌గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరంకోట

భోగాపురం ఎయిర్‌పోర్టుకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మళ్లీ శంకుస్థాపన చేయనున్నారని, ఎప్పటికి పూర్తి చేస్తారో స్పష్టతలేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజు అన్నారు. విజయనగరంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టుకు గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసినా, మళ్లీ వైసిపి ప్రభుత్వం శంకుస్థాపన చేసేందుకు ఎందుకు ఉవ్విళ్లూరుతోందని నిలదీశారు. ఎయిర్‌పోర్టుకు కేటాయించిన భూముల్లో 500 ఎకరాలు తగ్గించి, ఎకరానికి రూ.కోటి చొప్పున మిగిల్చామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారని తెలిపారు. భూముల కేటాయింపు తగ్గించి, ఎయిర్‌పోర్టు ప్రణాళికల్లో ఎక్కడ కోత పెట్టారో బహిర్గతం చేయడంలేదని చెప్పారు. గోవా, భోగాపురం ఎయిర్‌పోర్టుల కాంట్రాక్టులను జిఎంఆర్ సంస్థ తీసుకుందని గుర్తు చేశారు. గోవా విమానాశ్రయం ఇప్పటికే సిద్ధంగా ఉందని, భోగాపురం ఎయిర్‌పోర్టును మాత్రం ఇక్కడి పాలకులు శంకుస్థాపనలతో కాలం వెల్లదీస్తున్నారని విమర్శించారు. విభజన చట్టంలోని హామీల గురించి కేంద్రాన్ని అడిగే ధైర్యం ఈ ప్రభుత్వానికి లేదన్నారు. సమావేశంలో మాజీ సభాపతి ప్రతిభా భారతి, మాజీ మంత్రి కె.కళావెంకటరావు, నాయకులు పాల్గొన్నారు.

HDFC BANK
We understand your world

బంగారు ఆభరణాల వేలం ప్రకటన

ప్రత్యేకంగా ఋణగ్రహీతలకు, సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా తెలియజేయడమైనది ఏమనగా దిగువ పేర్కొన్న ఖాతాలకు సంబంధించి తనఖా పెట్టిన బంగారు ఆభరణాలు వేలం వెయ్యడానికి ప్రతిపాదించబడినది. ప్రత్యేకంగా ఋణగ్రహీతలకు తాము స్వయంగా సంతకం చేసిన ఋణ ఒప్పంద పత్రంలోని నియమ నిబంధనల ప్రకారం, తాము తీసుకున్న ఋణాలను చెల్లించకపోవడం, ఋణ బకాయిలు చెల్లించవలసిందిగా హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంకు లిమిటెడ్ (బ్యాంకు) నోటీసులు జారీ చేసినప్పటికీ బకాయి చెల్లింపులో విఫలం చెందడంతో సదరు తాకట్టు పెట్టిన బంగారు నగలు వేలం వేయబడతాయి. దిగువ పేర్కొన్న ఖాతాల్లోని ఋణం మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా ఋణగ్రహీతలకు 7 రోజుల తుది గడువుతో నోటీసు(లు) జారీచేయబడింది. ఒకవేళ సదరు ఋణ మొత్తం చెల్లించడంలో విఫలమైన పక్షంలో తనఖా పెట్టిన మొత్తం బంగారాన్ని మరో నోటీసు జారీచేయకుండా వేలం వేసే హక్కు బ్యాంకు కలిగియుంది. బ్యాంకుకు చెల్లించవలసిన ఋణ మొత్తం చెల్లించడంలో ఋణగ్రస్తులు నిర్లక్ష్యం వహించడంతో, ఋణ ఒప్పంద నియమాల ప్రకారం బ్యాంకుకున్న హక్కులను అమలు చేస్తూ, తాకట్టు పెట్టిన బంగారం మొత్తాన్ని వేలం వేయడం ద్వారా అమ్మకాలు చేపట్టి రుణగ్రహీతలు బ్యాంకుకు చెల్లించవలసిన ఋణం మొత్తాన్ని రాబట్టుకోవాలని నిర్ణయించింది.

దిగువ తెలిపిన షెడ్యూల్ ప్రకారం దిగువ తెలిపిన శాఖల వద్ద వేలం నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో దిగువ తెలిపిన తేదీన తనఖా పెట్టిన సెక్యూరిటీ వేలం నిర్వహించకపోయినా లేదా పూర్తి కాకపోయినా, ఏదేని తదుపరి తేదీన సదరు వేలం నిర్వహించుటకు లేదా కొనసాగించుటకు బ్యాంకు హక్కు కలిగి ఉంటుంది.

క్ర సం.	లోన్/రిఫరెన్స్ నం.	రుణగ్రహీత పేరు	రుణం తేది	ఋణం (రూ.)	వేలం జరుగు ప్రదేశం	వేలం జరుగు తేదీ & సమయం
1	72894389	రవితేజ ఎల్	27-01-21	67000	0214-తిరుపతి	25-04-2023 3.30 PM
2	73894075	గుల్లపూడి భవ్యచంద్ర ప్రియాంక	26-12-22	698000	0426-కాకినాడ	24-04-2023 3.30 PM
3	73288687	చింతపల్లి శ్రీనివాస్	26-10-21	53000	0473-నెల్లూరు	24-04-2023 3.30 PM
4	73455075	పొట్లూరి సింహాద్రి	19-03-22	30000	0473-నెల్లూరు	24-04-2023 3.30 PM
5	72889519	కడారి సూరిబాబు	25-01-21	125000	0741-తణుకు	25-04-2023 3.30 PM
6	73322735	గొల్ల లక్ష్మీనారాయణ	24-11-21	25000	0742-కర్నూలు	25-04-2023 3.30 PM
7	73396326	షేక్ కాజూల్	27-01-22	108000	0995-నంధ్యాల	24-04-2023 3.30 PM
8	73672058	రాగుల శ్రీనివాసులు	23-08-22	242000	1013-ప్రొద్దుటూరు	24-04-2023 3.30 PM
9	72901790	మచ్చా వెంకట రామయ్య	01-02-21	215000	1013-ప్రొద్దుటూరు	24-04-2023 3.30 PM
10	73359987	రాగుల శ్రీనివాసులు	24-12-21	150000	1013-ప్రొద్దుటూరు	24-04-2023 3.30 PM
11	73893524	గరిమెళ్ల రవి కిరణ్	26-12-22	102000	1243-దాబా గార్డెన్ - విశాఖపట్టణం	24-04-2023 3.30 PM
12	73582834	గరిమెళ్ల రవి కిరణ్	22-06-22	43000	1243-దాబా గార్డెన్ - విశాఖపట్టణం	24-04-2023 3.30 PM
13	73596454	వెంకటేష్ పడాల	02-07-22	36000	1243-దాబా గార్డెన్ - విశాఖపట్టణం	24-04-2023 3.30 PM
14	73594926	గోటూరు వెంకటశివ	01-07-22	24000	1243-దాబా గార్డెన్ - విశాఖపట్టణం	24-04-2023 3.30 PM
15	73542255	దాసరి నరసింహారావు	26-05-22	115000	1624-పిడుగురాళ్ళ	25-04-2023 3.30 PM
16	73486657	వేముల వెంకటేష్	18-04-22	66000	1624-పిడుగురాళ్ళ	25-04-2023 3.30 PM
17	73409738	వర్మశెట్టి బ్రహ్మయ్య	08-02-22	22000	1624-పిడుగురాళ్ళ	25-04-2023 3.30 PM
18	73196454	కాకాని వంశీకృష్ణ	25-08-21	125000	2025-రాయదుర్గం	24-04-2023 3.30 PM
19	73525009	కాకాని వంశీకృష్ణ	17-05-22	84000	2025-రాయదుర్గం	24-04-2023 3.30 PM
20	73254371	దూదేకుల మునిబాషా	29-09-21	333000	2259-మాచెర్ల	24-04-2023 3.30 PM
21	73221401	అల్లం వెంకట శివారెడ్డి	09-09-21	39100	2259-మాచెర్ల	24-04-2023 3.30 PM
22	72885238	బసిరెడ్డి ముని రెడ్డి	21-01-21	45000	2275-బద్వేల్	24-04-2023 3.30 PM
23	73909009	తోట బ్రహ్మాజీ	04-01-23	56000	2335-రేపల్లె	24-04-2023 3.30 PM
24	72909941	అశోక్ రెడ్డి హుక్కారా	06-02-21	50100	2380-రాయచోటి	25-04-2023 3.30 PM
25	73870216	పిన్నమరెడ్డి దుర్గాబాబు	15-12-22	214000	2383-పాలకొల్లు	24-04-2023 3.30 PM
26	73603297	వి శశికుమార్	07-07-22	171000	2435-మదనపల్లి	25-04-2023 3.30 PM
27	73516752	దేరెంగుల హరినాథ్	09-05-22	86000	2435-మదనపల్లి	25-04-2023 3.30 PM
28	73564144	పలగిరి ప్రవళిక	10-06-22	268000	2438-యెమ్మిగనూరు	26-04-2023 3.30 PM
29	73519896	పింజై మహబూబ్ బాషా	11-05-22	97500	2438-యెమ్మిగనూరు	26-04-2023 3.30 PM
30	73570665	రాజేష్ రాగపత్రుని	15-06-22	289500	2813-గాజువాక-విశాఖపట్టణం	24-04-2023 3.30 PM
31	73582977	రాజేష్ రాగపత్రుని	22-06-22	200800	2813-గాజువాక-విశాఖపట్టణం	24-04-2023 3.30 PM
32	72922743	కిల్లాడ గంగేశ్వరి	15-02-21	25000	2813-గాజువాక-విశాఖపట్టణం	24-04-2023 3.30 PM
33	73761980	గొల్లు మహేష్ బాబు	17-10-22	13000	2948-నర్సీపట్నం	25-04-2023 3.30 PM
34	73503603	షేక్ షరీఫ్	29-04-22	37000	4159-సి క్యాంప్ సెంటర్ కర్నూలు	25-04-2023 3.30 PM
35	73066607	గండు శేఖర్	07-06-21	151000	4284-వెంకటగిరి	26-04-2023 3.30 PM
36	73460285	అల్వకొండ లాజర్	23-03-22	252000	4494-డోన్	26-04-2023 3.30 PM
37	73666931	ఆర్ మధన్ బాబు	20-08-22	76000	8282-చిత్తూరు పట్టణం	26-04-2023 3.30 PM
38	73529609	మీగడ మరియన్న	18-05-22	90000	9396-నూనెపల్లి	24-04-2023 3.30 PM
39	73319028	మీగడ మరియన్న	22-11-21	89000	9396-నూనెపల్లి	24-04-2023 3.30 PM

ఈ వేలం "ఎక్కడ ఉన్నది అక్కడే" మరియు "ఉన్నది ఉన్నట్లు" ప్రాతిపదికన నిర్వహించబడుతుంది మరియు సదరు బంగారు ఆభరణాల నాణ్యత, స్వచ్ఛత, క్యారేట్ విలువ, బరువు లేదా మదింపుకు సంబంధించి ఎటువంటి ప్రాతినిధ్యాలు లేదా వారెంటీలు ఎట్టి పరిస్థితుల్లో బ్యాంకు ఇవ్వదు మరియు ఇవ్వబోదు. తాము ఇవ్వజూపిన విలువ మొత్తాన్ని బిడ్లు రూపంలో దాఖలు చేయడానికి ముందు సదరు బంగారు ఆభరణాల నాణ్యత, స్వచ్ఛత, క్యారేట్ విలువ, బరువు లేదా మదింపు గురించి తమకు తాము ధృవీకరించుకోడం, పరిశీలించుకోడం మరియు సంతృప్తి చెందడం మొదలగు అంశాలు కొనుగోలుదారుల యొక్క ఏకైక మరియు సంపూర్ణ బాధ్యత. వేలం నిర్వహించడానికి నిర్దేశించిన సమయానికి 45 నిమిషాల ముందు వేలందారులు తమ సొంత ఖర్చు మరియు వ్యయంతో, వేలం జరిగే చిరునామాలో నిపుణుల సలహాతో కానీ లేకుండా కానీ బంగారు ఆభరణాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవచ్చు. బ్యాంకు సముచితం అని భావించి నిర్ధారించిన కనీస రిజర్వు ధరకు లోబడి వేలం నిర్వహించబడుతుంది. బ్యాంక్ తన అభీష్టానుసారం విధించటానికి సబబుగా భావించే అదనపు నిబంధనలు మరియు షరతులకు లోబడి సదరు వేలానికి సంబంధించిన వేలం ప్రక్రియ మరియు అమ్మకం (ఒకవేళ ఉంటే) నిర్వహించబడుతుంది. ఒకవేళ పైన పేర్కొన్న రుణగ్రహీత(లు), ఋణ ఒప్పందం ప్రకారం బ్యాంకుకు చెల్లించాల్సిన తన వ్యక్తిగత ఋణ ఖాతా లోని ఋణం మొత్తాన్ని వేలానికి ముందు చెల్లిస్తే, తదుపరి నోటీసు లేకుండా, సదరు ఋణానికి సంబంధించి తనఖా పెట్టిన ఆభరణాలు వేలం నుండి ఉపసంహరించబడతాయి. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా మరియు ఎటువంటి కారణం చూపకుండా వేలాన్ని వాయిదా వేయడం లేదా రద్దు చేయడం మరియు ఎటువంటి కారణం చూపకుండా ఏదైనా ఒక బిడ్డును కానీ లేదా అన్ని బిడ్లను కానీ రద్దు చేయడం లేదా తిరస్కరించడం వంటి సంపూర్ణ విచక్షణాధికారాలు బ్యాంకు అధీకృత అధికారి కలిగియున్నారని తెలియచేయడమైనది.

ప్రదేశం: హైదరాబాద్
తేది: 14-04-2023

అధీకృత అధికారి
HDFC బ్యాంకు లిమిటెడ్

సంపాదకీయం

అణగారినవారికి రక్షణ ఏదీ?

రాష్ట్రంలో దళితులు, గిరిజనులు, మైనార్టీలు, మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరుగుతుండడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. అణగారిన తరగతుల అభ్యున్నతి కోసం విశేష కృషి చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఈ నెలలోనే కావడంతో, ఆ సందర్భంగా ఇది చర్చనీయాంశంగా ఉంది. ఈ తరగతులవారిపై దాడులు పెరుగుతుండడం ప్రజలను తీవ్రంగా కలచివేస్తోంది. కేంద్రంలో నరేంద్ర మోడీ గద్దెనెక్కాక ఒక పథకం ప్రకారమే ప్రజలమధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం, అణగారిన తరగతులవారికి రక్షణ లేకుండా చేయడం వంటివి జరుగుతున్నాయి. అగ్రకుల దురహంకారం పెరిగిపోయింది. మతమార్పిడుల పేరుతో మైనార్టీలపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారు. మనువాద సిద్ధాంతాలు అమలు చేస్తూ గిరిజనులు, మైనార్టీల హక్కులను కాలరాస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పరిస్థితులను పరిశీలిస్తే ఎవరికైనా ఆందోళన కలగకమానదు. అధికార పార్టీ నాయకులే కొన్ని చోట్ల దళితులు, గిరిజనులపై దాడులకు పాల్పడడం, ఇంకొన్ని ఘటనలపట్ల రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. అణగారిన తరగతులవారి మీద జరుగుతున్న దాడులపై ఉన్నత స్థాయి న్యాయ విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని, వారి సిఫార్సులకు అనుగుణంగా దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ నానాటికీ బలపడుతోంది.

సామాన్యులకు, నిరుపేదలకు సంక్షేమ పథకాలు ఊరటనిస్తాయన్న మాట నిజం. అయితే వాటిని అమలు చేయడం మాత్రమేగాక అణగారిన ప్రజలకు తగిన రక్షణ కూడా కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. రాష్ట్రంలో రాజన్న రాజ్యాన్ని తీసుకొస్తామని అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రస్తుతం మోడీ రాజ్యాన్ని యథాతథంగా అమలు చేస్తున్నారన్న విమర్శ సత్యదూరం కాదు. అల్లూరి జిల్లా వాకపల్లి గిరిజన మహిళలపై గ్రేహౌండ్ పోలీసుల సామూహిక అత్యాచారం కేసులో తీర్పు అనంతరం ముఖ్యమంత్రి స్పందన లేదు. దళితుడైన కారు డ్రైవర్ సుబ్రహ్మణ్యంను హత్య చేసి శవాన్ని డోర్ డెలివరీ చేసిన అధికార పార్టీ ఎంఎల్‌సి అనంతబాబుపై తీవ్ర చర్యలు లేవు సరికదా బెయిలుపై జైలు నుంచి విడుదలైన సందర్భంగా ఘనంగా స్వాగతం పలకడం ఎటువంటి సంకేతాలిస్తుంది? నెల్లూరు జిల్లా దగదర్తి, కాకినాడ జిల్లా తొండంగిలో దళితులపై జరిగిన దాడుల్లో ప్రభుత్వం పెత్తందార్ల కొమ్ముకాసిందన్నది జగమెరిగిన సత్యం. కడపలో జిల్లా స్థాయి పశువైద్య అధికారి డాక్టర్ అచ్చెన్నను హత్య చేసిన నిందితులను కాపాడుతోందన్నది జనవాక్యం. విశాఖపట్నంలో డాక్టర్ సుధాకర్, పాణ్యంలో ముస్లిం కుటుంబ సభ్యుల ఆత్మహత్యలు... ఇలా ఎన్నో! ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు జనాభా ప్రాతిపదికన బడ్జెట్లో 23 శాతం ఖర్చు చేయాల్సి ఉండగా, 12 శాతం మాత్రమే ఖర్చు పెడుతున్నారు. అందులోనూ నిధుల మళ్లింపు షరా మామూలే! కులాలవారీగా బిసి కార్పొరేషన్ చైర్మను పదవులు ఇచ్చినా నిధుల మాటేమోకానీ వారికి కనీసం కూర్చునేందుకు కుర్చీ కూడా లేని దుస్థితి.

నగదు బదిలీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం కదా అని ప్రభుత్వం సామాజిక భద్రత బాధ్యతను విస్మరిస్తే కుదరదు. ప్రభుత్వం ఒకవైపు నవరత్నాల జపం చేస్తూ మరోవైపున గత కొన్ని దశాబ్దాలుగా దళితులు, గిరిజనులు, మైనార్టీలు, వికలాంగులు పొందుతూ వస్తున్న అనేక రాయితీలను అటకెక్కించింది. ఆ బాధ ఈ తరగతులవారిలో నివురుగప్పిన నిప్పులా ఉంది. పరిస్థితిని చక్కదిద్దడానికి, అణగారిన తరగతుల వారికి రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టాలి. ఆయా తరగతుల ప్రజానీకానికి భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత. కాని మోడీ సర్కారు ఆదేశించిన నయా ఉదారవాద ఆర్థిక విధానాల్ని, నూతన విద్యా విధానాన్ని రాష్ట్రంలో వేగంగా అమలు చేస్తున్న వైసిపి ప్రభుత్వం సామాజిక రంగంలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తుందా అన్న సందేహం ఎవరికైనా కలగడం సహజం. కాబట్టి అణగారిన తరగతులవారికి రక్షణ కల్పించే చర్యలు చేపట్టేలా ఈ సర్కారుపై ప్రజా ఒత్తిడి పెరగాలి. అందుకు ఐక్య ఆందోళనా పోరాటాల్ని మరింత పెంచాలి. ఇందుకు ఆయా తరగతుల ప్రజానీకం, ప్రగతికాముకులూ నడుం బిగించాలి.

సందర్భం

ఈ ప్రజాస్వామ్యంలో రాజకీయ అధికారానికి మెట్లు ఎక్కి వస్తున్న అగ్రకులాలు దళితుల్ని కింది స్థాయి నుంచి ఎదగనివ్వడం లేదనేది చారిత్రిక సత్యం.
- ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్

విద్య-దళిత విమోచనం-అంబేద్కర్ దృక్పథం

నివాళి

ప్రొ॥ జె.వి. రాఘవేంద్రరావు

విద్య తాలూకు అంబేద్కర్ దృక్పథానికి, ఆయన వృత్తి ఉద్యోగ జీవిత వికాసానికి (కెరీర్ డెవలప్‌మెంట్‌కి) అవినాభావ సంబంధముంది. మెట్రిక్ పూర్తయిన తరువాత ఆయన మహారాజు శాయాజీరావు ఎస్టేట్లో పనిచేశాడు. 1917లో విదేశాలలో విద్యాభ్యాసం ముగించుకు వచ్చాక మళ్ళీ బరోడా మహారాజా దగ్గర మిలిటరీ సెక్రటరీగా పనిచేశాడు. ఆయన సంస్థానంలో పనిచేస్తున్న ఇతర ఉద్యోగులు అంబేద్కర్‌ను సాటిమనిషిగా, సగౌరవంగా ఎప్పుడూ చూడలేదు. అక్కడి చప్రాసీలు, సిబ్బంది ఆయనను చాలా నీచంగా చూసేవారు. ఆయనకు సరైన ఇల్లు, భోజన వసతులు దొరకలేదు. విద్యారంగంలో ఉన్నత ప్రమాణాలు కలిగిన పరిశోధనలు చేసి, అంబేద్కర్ రెండు డాక్టరేట్లు సంపాదించాడు. గొప్ప మేధావిగా అప్పటికే ఆయనకు ఇతర పండితుల నుంచి ఆమోద ముద్ర పడింది. అయినా మహర్ కులంలో పుట్టడంవల్ల పుట్టుకతో వచ్చిన అస్పృశ్యతా కళంకం అతన్ని వెన్నాడుతూనే ఉంది. ఉన్నత కులాల వారి చేతిలో ఆయనకు పీడన, వివక్ష తప్పలేదు. 1918 నవంబరులో ఆయన బొంబాయి లోని సిడ్నెహం కళాశాలలో రాజకీయ అర్థశాస్త్రంలో ఆచార్యుడిగా చేరాడు. అటు తర్వాత ఆయన మళ్ళీ లండన్ వెళ్ళాడు. లండన్ నుంచి తిరిగి వచ్చాక లాయరు వృత్తిలో చేరి, ఆదాయం చాలక, బాట్లీ బాయ్ అకౌంటెన్సీ ఇన్‌స్టిట్యూట్‌లో మూడేళ్ళు పార్ట్ టైం ప్రాతిపదికగా వ్యాపార న్యాయశాస్త్రం ఆచార్యుడిగా పనిచేయాల్సి వచ్చింది. బొంబాయి విశ్వవిద్యాలయం న్యాయశాస్త్ర పరీక్షాధికారిగా కూడా పనిచేశాడు. నాలుగేళ్ళు గడిచాక బొంబాయి లోని ప్రభుత్వ న్యాయ కళాశాలలో పూర్తిస్థాయి ఆచార్యుడిగా నియమింపబడ్డాడు. ఆయనకు విద్యార్థులు, అధ్యాపకులతో మంచి సంబంధాలుండేవి. అడపా దడపా నిరుత్సాహకరమైన సంఘటనలు కూడా జరిగాయి. కాని అంబేద్కర్ వీటిని పక్కకు నెట్టి, విద్యా విషయం పట్ల ఒక సమగ్ర దృక్పథాన్ని రూపొందించుకున్నాడు. కొంతకాలం గడిచాక, జూన్ 1935లో, బొంబాయి లోని ప్రభుత్వ లా కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమింపబడ్డాడు. ప్రిన్సిపాల్‌గా గడించిన మూడేళ్ళ అనుభవం విద్యా, పరిపాలనా విషయాలతో ఆయనను నిశితగ్రాహిగా, నిష్ణాతుడిగా రూపొందించింది. తదుపరి ఆయన బొంబాయి ప్రాంతీయ శాసన సమితి సభ్యుడిగా చేరాడు. సమితిలో మహర్ జాతివారి అనేక విద్యా సమస్యలను లేవనెత్తి కూలంకషంగా చర్చించాడు. విద్యారంగంలోని సంక్లిష్ట సమస్యల పట్ల ఆయనకు చక్కని అవగాహన ఏర్పడింది.

అంబేద్కర్ విద్యాప్రాపంచిక దృక్పథం, విలువలు ఆయన పూర్వజులైన మేధావులు, సంస్కర్తల వారసత్వంలోని భాగమేకాని - వేరు కాదు. దాదాభాయి నౌరోజీ నుంచి, పూలే, రనడే, గోఖలే, తిలక్ దాకా వికసించిన విద్యాచింతన, ఆచరణను అంబేద్కర్ స్వంతం చేసుకున్నాడు. రాజా రామ్‌మోహన్ రాయ్ కాలం నుంచి ఇంగ్లీషు విద్యకు బాగా ప్రాచుర్యం లభించింది. ఇంగ్లీషు విద్య ద్వారా నూతన విజ్ఞానం, హేతుబద్ధ మైన ఆలోచన, మానవీయ విలువలను భారతీయులలో ఆవిష్కరించవచ్చునని వీరందరి గట్టి నమ్మకం. వీరి దృక్పథాన్ని అంబేద్కర్ కూడా పంచుకున్నాడు. తన తోటి మహర్ సోదరులు చదువు లేకుండా కర్మ సిద్ధాంతం లాంటి మూఢ నమ్మకాలకు బలై బతుకుతున్న విషయం అంబేద్కర్ గమనించాడు. వారి పాశవిక బతుకులో మానవీయ దీపాలను వెలిగించాలంటే వారికి విద్య గరపాలి. మహర్ జనావళిలో విద్య విస్తారంగా పెరిగిన కొద్దీ వీరిలో ఒక నవ్య చైతన్యం వస్తుంది. అప్పుడు వారు స్వచ్ఛందంగా ఒక కొత్త ఆచరణ వైపు, ఆత్మవిముక్తి వైపు పోరాడుతూ పురోగమిస్తారని అంబేద్కర్ ప్రబల విశ్వాసం.

దళిత విముక్తి సాధించడానికి అంబేద్కర్ అనేక పాఠశాలలను స్థాపించాడు. 1920లో నాగపూర్‌లో కర్మవీర్ వి.ఆర్.షిండేను కలిసి ముఖాముఖి మాట్లాడినప్పుడు, దళిత పాఠశాలలను, విద్యాసంస్థలను దళితులే స్థాపించాలని, వారి యాజమాన్యం కిందనే వాటిని నడపాలని గట్టిగా వాదించాడు. అయితే షిండే ఈ అభిప్రాయాన్ని పూర్తిగా ఆమోదించలేదు. 1945లో "పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ" నేతృత్వంలో బొంబాయిలో సిద్ధార్థ కాలేజీని స్థాపించాడు. తరువాత ఇందులో వాణిజ్య, న్యాయ కళాశాలలను, అదనంగా చేర్చారు. ఔరంగాబాదులో మిళింద్ కళాశాల, మహద్‌లో అంబేద్కర్ కళాశాలలను తదుపరి ప్రారంభించారు. అంబేద్కర్ పేరిట నాగపూర్‌లో ఇంకొక కళాశాలను కూడా నవ బౌద్ధులు స్థాపించారు. అంబేద్కర్ అనుచరులు క్రమేపి దళిత ప్రజల మనోవికాసానికి, పురోభివద్ధికి అనేక కళాశాలలను, విద్యాసంస్థలను స్థాపించారు.

ఇంతవరకు అంబేద్కర్ జీవిత చరిత్రను ఆయన సామాజిక నేపథ్యాన్ని జోడించి విద్య తాలూకు ఆలోచనలను చర్చించాము. ఇప్పుడు అంబేద్కర్‌లో ఆకతి చెందిన విద్య తాలూకు మౌలిక చింతనను విశ్లేషిద్దాం.

"పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ" ప్రారంభోపన్యాసంలో విద్య పట్ల తనకున్న ప్రాథమిక అభిప్రాయాలను స్పష్టం చేశాడు అంబేద్కర్. విద్యా సంస్థల రెండు ప్రధాన లక్ష్యాలు: ఒకటి, సత్యాన్వేషణ. రెండు, వ్యక్తి జీవితంలో మానవీయ విలువల్ని పెంపొందించడం. బుద్ధుడు తన ప్రవచనాలలో ప్రచారం చేసిన, సూత్రత్రయం అంబేద్కర్ జీవితాన్ని, ఆయన విద్యా చింతనను నిశితంగా ప్రభావితం చేసింది. ఆ సూత్రాలు 1. ప్రజ్ఞ 2. కరుణ 3. సమత. ఈ మూడు సూత్రాలు ఆయన బతుకు శైలికి మార్గదర్శకంగా ఉండటమే కాదు-ఆయన విద్యాచింతనను, ఆచరణను కూడా కాంతిమయం చేశాయి. బుద్ధుడి హేతువాదం, డూయీ శాస్త్రీయ ఆలోచనా వాదాల (సైంటిఫిక్ టెంపరిమెంట్)తో ప్రేరణ పొందిన అంబేద్కర్...జనావళిలో ప్రధానంగా విద్యార్థులలో విద్య ద్వారా శాస్త్ర దృష్టిని పెంపొందించడానికి కృషిచేశాడు.

1937లో బ్రిటీషు పాలకులు ప్రాంతీయ స్వయం పాలనా శాసనం కింద సాధారణ ఎన్నికలు జరుగుతాయని ప్రకటించారు. ఎన్నికలకు ముందు అంబేద్కర్ 'ఇండియన్

> **స్వచ్ఛంద వనరులతో అనేక స్వచ్ఛంద విద్యాసంస్థలను అంబేద్కర్ ప్రారంభించారు. కాని జీవితం ఆధునికం కావాలంటే వారందరికీ రాజ్యమే విద్యావకాశాలు కల్పించాలని ఆయన ప్రగాఢ విశ్వాసం. ఆయన కాంక్షించిన సోషలిజంలో లక్షోపలక్షలుగా ఉన్న పేద నిరక్షరాస్య ప్రజలకు అక్షరాస్యతను, విద్యను అందించి, రాజ్యం వారిని శ్రేయోన్ముఖులను చేయాలి!**

నేడు డా॥బి.ఆర్.అంబేద్కర్ 132వ జయంతి

లేబర్ పార్టీ'ని స్థాపించాడు. ఆ పార్టీ ప్రణాళికలో దళిత వర్గాల అభివద్ధికి దోహదం చేసే విద్యావిధానాన్ని రూపొందించాడు డాక్టర్ అంబేద్కర్. నిరక్షరాస్యతను రూపుమాపాలంటే పరిపూర్ణ నిర్బంధ విద్యావిధానాన్ని అమలు పరచాలన్నాడు. బ్రిటీషు వాళ్ళు ప్రవేశపెట్టిన ఉదార విద్యావిధానం. - అటు ఉన్నత వర్గాల వారికి కానీ, ఇటు నిమ్న వర్గాల వారికి కానీ అట్టే ఉపయోగపడదని చెప్పాడు. విభిన్న వృత్తులలో శిక్షణనిచ్చే సాంకేతిక విద్య చాలా అవసరమని వాదించాడు. చాలామంది షెడ్యూల్డు కులాలవారు దారిద్ర్యరేఖకు అట్టడుగున ఉండటంవల్ల, వాళ్ళ పిల్లల్ని చదివించుకోలేరు. అందుకే విద్యాలయాలలో షెడ్యూల్డు కులాల వారికి ఉపకార వేతనాలిచ్చి చదువుకునే అవకాశం కల్పించాలని నొక్కి చెప్పాడు. ప్రకార్యాల రీత్యా విశ్వవిద్యాలయాలను శిక్షణాత్మక (టీచింగ్), శిక్షణేతర (నాన్ టీచింగ్) విశ్వవిద్యాలయాలుగా విభజించాలని సలహా ఇచ్చాడు.

సార్వత్రిక నిర్బంధ ప్రాథమిక విద్యను ఉద్యమ స్పృహతో ప్రచారం చేసిన వారిలో అంబేద్కర్ ఒకరు. బొంబాయి శాసన సభలో ఆనాటి విద్యామంత్రి అప్పుడు అమలులో ఉన్న విద్యా శాసనాన్ని మార్చి, ప్రాథమిక పాఠశాలల్లో చరఖా వడకటాన్ని ప్రవేశపెట్టాలని ప్రయత్నించాడు. గాంధీజీ తన "నయీ తాలీమ్"లో భాగంగా ఆర్థికంగా వెనుకబడి ఉన్న పిల్లలు చరఖా వడికి సంపాదిస్తూ, చదువుకోవచ్చునని అభిప్రాయపడ్డాడు. దీన్ని అంబేద్కర్ వ్యతిరేకించాడు. "సంపాదిస్తూ చదువు" పథకాన్ని గాంధీజీ గ్రామాలలో ఉన్న పేదరికాన్ని నిరుద్యోగాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించారే కాని ఏదో ఒక ప్రత్యేక సామాజిక వర్గాన్ని (దళితులు, ఇతరులు) దృష్టిలో వుంచుకొని కాదు. అయితే అంబేద్కర్ దృక్పథం వేరు. ఆయన అభిప్రాయంలో హైందవ సమాజంలోని అట్టడుగున ఉండే అతి దరిద్రులైన వర్గంవారు - షెడ్యూల్డు కులాల పిల్లలు. వారిని సంపాదిస్తూ చదువుకోండని అంటే - వారు సంపాదన వైపు ఎక్కువ ఆకర్షింపబడి, చదువును అశ్రద్ధ చేసే అవకాశం ఉంది. అంతే కాదు. "పొట్ట తిప్పలు" లేకుండా చదువుకోగలిగితే వారిలో విజ్ఞాన తృష్ణ, సాహసోపేతమైన చింతన వృద్ధి చెందుతాయి. అందుకే విద్య నిర్బంధం చేయాలని అంబేద్కర్ వాదించారు.

స్వచ్ఛంద వనరులతో అనేక స్వచ్ఛంద విద్యాసంస్థలను అంబేద్కర్ ప్రారంభించారు. కాని జీవితం ఆధునికం కావాలంటే వారందరికీ రాజ్యమే విద్యావకాశాలు కల్పించాలని ఆయన ప్రగాఢ విశ్వాసం. ఆయన కాంక్షించిన సోషలిజంలో లక్షోపలక్షలుగా ఉన్న పేద నిరక్షరాస్య ప్రజలకు అక్షరాస్యతను, విద్యను అందించి, రాజ్యం వారిని శ్రేయోన్ముఖులను చేయాలి!

విశ్వవిద్యాలయాలలో, కళాశాలల్లో బ్రిటీషు వారు ప్రవేశపెట్టిన వలస విద్యావిధానం, బోధనా పద్ధతులు దురదృష్టకరమని అంబేద్కర్ అభిప్రాయం. దాదాపు అదే వలస విద్యా విధానం స్వాతంత్ర్యానంతరం కూడా మన దేశంలో కొనసాగుతోంది. దీన్ని మార్చాలని ఆయన తపన, ఉద్దేశ్యమూనూ.

అమెరికన్ విశ్వవిద్యాలయాలలో ఒక కోర్సు చదువుతున్నప్పుడు, అనేక విషయాలను ఐచ్ఛికాలుగా తీసుకోవచ్చు. దానివల్ల విద్యార్థి విజ్ఞాన పరిధి గణనీయంగా పెరుగుతుంది. భారతదేశంలోని విద్యాలయాలలోని కోర్సులలో, విస్తారమైన మార్పు రావాలని అంబేద్కర్ అభిప్రాయం. స్వానుభవం ఆధారంగా బోధనాత్మక పరిశోధనా సిబ్బంది మధ్య అంతస్తు, వేతన వ్యత్యాసాలు బాగా తగ్గించాలని ఆయన వక్కాణించారు. అలాగే ఒకే విశ్వవిద్యాలయం పరిధిలో నడిచే డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేట్ కళాశాలల మధ్య అంతస్తు వ్యత్యాలసాలు వుండ కూడదని చెప్పారు.

విద్యార్థులంటే అంబేద్కర్‌కు చాలా మక్కువ. ప్రభుత్వ లా కాలేజి ప్రిన్సిపాల్‌గా పనిచేసినప్పుడు ఆయన అక్కడి గ్రంథాలయాన్ని బాగా అభివృద్ధి చేశాడు. విద్యార్థులు విజ్ఞానంతో పాటు, వినోద క్రీడా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేట్టుగా వారిని ఉత్సాహపరిచాడు. అనేక వసతులను, సాధనాలను సమకూర్చాడు. ఆయన చక్కని చిత్తశుద్ధి గల మాష్టారు. బాగా కష్టపడి పాఠాల్ని తయారుచేసి చాలా ఉత్సాహంతో నిశిత దృక్పథంతో చెప్పేవాడు. ఆయన అభిప్రాయంలో ఒక ప్రొఫెసర్ పండితుడై ఉంటే సరిపోదు. చక్కని స్వర విన్యాసంతో బోధించాలి. ఆయన క్షుణ్ణంగా తెలుసుకొన్నవాడై ఉండాలి. ఆచార్యులు నిర్విరామంగా జ్ఞానాన్ని ఆర్జిస్తూ, సత్యాన్ని శోధిస్తూ, దాన్ని ఆచరించడానికి ప్రయత్నించాలని బోధ చేశాడు అంబేద్కర్.

అధ్యయనం నుంచి పోరాటం, పోరాటం నుంచి అధ్యయనం వైపు నిరాఘాటంగా సాగిన జీవితం అంబేద్కర్‌ది. రాజకీయ - ఆర్థిక, సాంఘిక - సాంస్కృతిక సమస్యలను అధ్యయనం చేయడంలోని జిజ్ఞాస ఆయన జీవితాంతం కొనసాగింది. తుది క్షణాల వరకు చదువుతూ, రాస్తూనే ఉన్నాడు.

విద్య పట్ల అంబేద్కర్‌కు వున్న నిబద్ధత చాలా గొప్పది - ఈ జిజ్ఞాసా దృక్పథం ఆయన సమస్త ఆలోచనలను, ఆచరణను ప్రభావితం చేసింది. బ్రిటీషు కాంగ్రెస్, ముస్లిం లీగ్ వారికి వ్యతిరేకంగా ఆయన నడిపిన పోరాటాలు పార్లమెంటరీ పంథాలో నడిచాయి. మహజర్లు, చర్చలు, ప్రాతినిధ్య పద్ధతుల ద్వారా సామాజిక సమస్యలను విశదీకరిస్తూ. వాటి పరిష్కారానికి కృషి చేయవచ్చు. ఆయన భారతీయ కరెన్సీ తాలూకు రాయల్ కమిషన్, సైమన్ కమిషన్ల ముందు హాజరయి షెడ్యూల్డు కులాల సమస్యలను వెలుగులోకి తెచ్చాడు. అలాగే రౌండ్ టేబుల్ సమావేశాలలో అనేకసార్లు దళిత సమస్యలను ఆవేశంతో, ఉద్రేకంతో నివేదించాడు. ఈ పద్ధతుల ద్వారా కొంత జాప్యం జరిగినా, క్రమంగా దళితులు తమ స్వాధీనతను, విమోచనను సాధించగలరని ఆయన అచంచల విశ్వాసం. దీనికి భిన్నంగా సత్యాగ్రహం, సహాయ నిరాకరణోద్యమం పద్ధతులను, పోరాట పద్ధతులుగా వాడుకున్నాడు గాంధీజీ. తన మొత్తం జీవిత పోరాట కాలంలో అంబేద్కర్ మూడుసార్లే సత్యాగ్రహాన్ని వాడాడు. అస్పృశ్యులకు ఇతరులతో సమానంగా చెరువుల్లోని నీరు వాడే హక్కున్నదని నిరూపించడానికి ఆయన డిసెంబరు 1927లో మహద్‌లో సత్యాగ్రహాన్ని నడిపాడు. అలాగే మార్చి 1930లో నాసిక్ లోని కాలారాం మందిరంలో అస్పృశ్యులకు, సవర్ణ హిందువులతో సమానంగా ఈశ్వరుణ్ని ఆరాధించే హక్కును కల్పించడానికి దేవాలయం ప్రవేశ ఉద్యమం నడిపినప్పుడూ, విదర్భ ప్రాంతంలో భూమి లేని దళిత రైతులకు భూమి పంచి ఇవ్వాలన్నప్పుడూ, ఆయన సత్యాగ్రహ పద్ధతులను వాడాడు. స్వతహాగా ఆయనకు సత్యాగ్రహంలో నమ్మకం లేదు. అలాగే గాంధీజీ ప్రతిపాదించిన హదయ పరివర్తన సిద్ధాంతంలో కూడా నమ్మకంలేదు. సత్యాగ్రహం ద్వారా సమస్యలపట్ల జనంలో చైతన్యం కలిగించినాబీ పోరాటంవల్ల కొన్ని లాభాలు కలిగినా, శాసన నిర్మాణం ద్వారానే ఆ లాభాలు ప్రజలకు శాశ్వతంగా అందించవచ్చునని అంబేద్కర్ స్పష్టంగా ప్రకటించాడు. దీనివల్ల రాజకీయంగా అంబేద్కర్ రాజ్యాంగ, పార్లమెంటరీ ప్రజాస్వామ్య న్యాయసమ్మతమైన పద్ధతులను గట్టిగా నమ్మేవాడని బోధపడుతుంది. జీవితాన్ని ఒక సాహసోపేతమైన ఉద్యమంగా భావించే ప్రతి వ్యక్తికి అంబేద్కర్ జీవితం మరువలేని మధురమైన పాఠం!

/వ్యాసకర్త ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు/

/డా॥బి.ఆర్.అంబేద్కర్ స్మారకోపన్యాసం సంక్షిప్తంగా.../

గాంధీజీని, మొఘలులను ఎందుకు తొలగిస్తున్నారు?

విశ్లేషణ

భారత స్వాతంత్ర్య పోరాటానికి సంఘపరివార్ దూరంగా వుంది. అందువల్ల, బహుళత్వాన్ని నొక్కి చెప్పే జాతీయవాద అభిప్రాయాలను కూడా వారు అంగీకరించరు. దీనికి సంబంధించిన చరిత్ర పాఠాలను చెరిపివేయడం, వక్రీకరించడం అనేది సంఘపరివార్ ముఖ్యమైన రాజకీయ ఎజెండాగా మారింది.

విద్య కాషాయీకరణ చేసినట్లయితే, దేశంలోని అన్ని అంశాలను మతతత్వంతో నింపవచ్చునన్న ఉద్దేశంతోనే సంఘపరివార్ విద్యారంగంలోకి జొరబడుతోంది. ఇందులో భాగంగానే మొఘలుల చరిత్రను, గాంధీజీ లౌకిక విధానాన్ని ఇటీవల ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాల నుంచి తొలగించారు. దీనికి కొనసాగింపుగా గుజరాత్ మారణహోమం, దళితులపై సాగిన హింస వంటి అంశాలనూ పాఠ్యాంశాల నుంచి తీసివేశారు.

పి. దినేశన్

భారతదేశాన్ని బ్రిటిష్ వారు పాలించిన సమయంలో జేమ్స్ మిల్ భారతదేశ చరిత్రను హిందూ కాలం, ఇస్లామిక్ కాలం, బ్రిటిష్ కాలంగా వర్గీకరించాడు. సంఘ పరివార్ కూడా దీన్నే అనుసరించింది. ఈ వలసవాద చరిత్ర పాఠాన్ని జవహర్‌లాల్ నెహ్రూ తన ప్రసిద్ధ పుస్తకం 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో బహిర్గతం చేశారు.

మతతత్వం, మత విశ్వాసం అనేవి రెండు వేర్వేరు అంశాలు. మతతత్వం అనేది రాజకీయ ప్రయోజనాల కోసం మతాన్ని ఉపయోగించుకునే మార్గం. హిందువులు ముందుకు తెచ్చింది సంఘ పరివార్ హిందుత్వ దృక్పథాన్ని కాదు. స్వామి వివేకానంద 1893లో చికాగో ప్రసంగం ద్వారా భారతదేశం లోని హిందూ మత సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పారన్నాడు. వాస్తవానికి ఆయన ప్రసంగం ఇలా సాగింది. "సహనాన్ని, సార్వత్రిక ఆమోదాన్ని ప్రపంచానికి ప్రబోధించిన మతాన్ని అనుసరించినందుకు నేను గర్విస్తున్నాను. మేము సార్వత్రిక సహనాన్ని విశ్వసించడమే కాకుండా, ప్రపంచం లోని అన్ని మతాలు, శరణార్థులకు నా దేశం ఆశ్రయం ఇచ్చిందని చెప్పడానికి నేను గర్వపడుతున్నాను." అన్నాడు. ఆ ప్రసంగం లోనే మత మౌఢ్యం మనిషికి అతి పెద్ద శత్రువు అని, అయితే మతోన్మాదం అంతకన్నా దారుణమైనదని గుర్తుచేశాడు. ప్రకృతి భిన్నత్వంలో ఏకత్వాన్ని నిర్దేశించిందని, హిందువులు దీనిని అంగీకరించారని వివేకానంద చెప్పారు. హిందువుకే మోక్షం ఉందని, మరెవరికీ లేదని సంస్కృత శ్లోకాల్లో ఎక్కడైనా ఉందా అని వివేకానంద సవాలు విసిరాడు.

గాంధీ కూడా ఇటువంటి మార్గాన్నే అనుసరించాడు. ప్రార్థనా సమయంలో ఆయనకు గీత, ఖురాన్, బైబిల్ తప్పనిసరి. ఈ విధానానికి భయపడిన హిందుత్వ శక్తులు ఆయనను తుపాకీతో కాల్చి చంపాయి. హిందుత్వ శక్తులకు వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి గాంధీజీ జీవితం గొప్ప ఉదాహరణ. అందుకే గాంధీజీ జ్ఞాపకాలను ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాల నుంచి తొలగిస్తున్నారు.

హిందూయిజానికి సంబంధించి వివేకానందుడు, గాంధీజీ ప్రతిపాదించిన అభిప్రాయాలను, విశ్వాసాలను మార్చి "హూ ఈజ్ ఎ హిందువు?" అనే పుస్తకంలో (1920) సావర్కర్ హిందుత్వ రాజకీయ పాఠాలను పరిచయం చేశాడు. గాంధీజీకి, సావర్కర్‌కి మధ్య హిందూ మతావలంభకునికి పచ్చి హిందుత్వ వాదికి వున్నంత తేడా ఉంది.



> **భారతీయ సంస్కృతి భిన్నత్వంతో రూపుదిద్దుకుంది. ఆర్యులు, పర్షియన్లు, గ్రీకులు, అరబ్బులు, ఇండో-పార్థియన్లు వంటి వివిధ రకాల ప్రజలను కలుపుకొని భారతీయ సమాజం అభివృద్ధి చెందింది. హిందూత్వ వాదులతో పాటుగా మతతత్వ జాతీయవాదులను ఎదుర్కోవాలంటే...భిన్నత్వంలో ఏకత్వం నిండిన భారతీయ సంస్కృతికి సంబంధించిన చరిత్ర పాఠాలను రూపొందించడం ఎంతైనా అవసరం. చారిత్రిక అభివద్ధి క్రమంలో ఏర్పడిన అన్ని ఉత్తమ సంప్రదాయాలను మనం ముందుకు తీసుకెళ్లాల్సి వుంది.**

భారతదేశ సహనశీలతను కొనియాడుతూ వివేకానంద చికాగోలో ప్రసంగించాడు. మొఘల్ కాలం...సంఘ్ పరివార్ ప్రచారం చేసిన మత ద్వేషం, మతపరమైన హింసల కాలం మాత్రమే కాదు కాబట్టి వివేకానంద అటువంటి వివరణ ఇవ్వగలిగాడు. 1556 నుండి 1605 వరకు పాలించిన అక్బర్ అన్ని మతాలను కలిపి వుంచడానికి, రాజ్య నిర్మాణంలో మతపరమైన జోక్యాన్ని తొలగించడానికి కృషి చేశాడు. ఐరోపాలో బ్రూనో వంటి అనేక మందిని మతపరమైన విచారణ పేరుతో చిత్రహింసలకు గురిచేసి సజీవదహనం చేశారు. ఆ సమయంలో అక్బర్ భారతదేశంలో అందరికీ శాంతిని అందించేందుకు గాను 'సుల్-హి-కుల్' విధానాన్ని అమలు చేశాడు.

ఎన్‌సిఇఆర్‌టి నుండి తొలగించబడిన మొఘలుల కాలం భారతదేశంలో పురోభివృద్ధి సాధించబడిన కాలమని మర్చిపోకూడదు. దేశీయోత్పత్తి (జిడిపి) 25 శాతం పెరిగిన సమయం అది. ఈ ఆర్థిక వృద్ధే యూరోపియన్ శక్తులను భారతదేశం వైపు ఆకర్షించింది. అక్బర్ భారతదేశంలోని అన్ని మతాల సామరస్యాన్ని నిలబెట్టాడు. ప్రధాన స్రవంతి హిందూ మతాన్ని, సూఫీతో సహా ఇస్లాం లోని ఇతర శాఖలను, మతాలను ఆదరించాడు. ఈ విధమైన బహుళత్వ సంప్రదాయాలను అంగీకరించని సంఘ పరివార్ మొఘలుల కాలాన్ని పాఠ్యపుస్తకాల నుంచి తొలగిస్తోంది.

మొఘల్ రాజులు భారతదేశాన్ని తమ సొంత భూమిగా భావించారు. భారతీయ సంస్కృతిలో ఏర్పడిన ప్రతిదీ వారి వారసత్వంలో భాగంగా వచ్చినదే. అక్బర్ ఆస్థానంలో 100,000 శ్లోకాలతో కూడిన మహాభారతం పర్షియన్ భాషలోకి అనువదించబడింది. అలా మహాభారత ప్రపంచ యాత్ర మొదలైంది. అక్బర్ ఆస్థానంలో యువరాజులకు మహాభారతం లోని శాంతి పర్వాన్ని బోధించేవారు.

ముస్లిం పఠాన్ రాజుల కాలంలో మహాభారతం స్థానిక భాషలోకి అనువదించబడింది. ఉపనిషత్తులను పర్షియన్ భాషలోకి అనువదించి ప్రపంచానికి అందించింది మొఘల్ యువరాజు దారా సుకోవ్. మొఘల్ రాజుల దగ్గర సైన్యాధిపతులు, మంత్రులుగా పనిచేసిన వారందరూ హిందువులే. జహంగీర్, షాజహాన్ రాజపుత్ర స్త్రీలకు జన్మించిన వారే. 1857లో స్వాతంత్ర్య సమరం మొదటి దశలో మొఘల్ రాజు బహదూర్ షా భారత చక్రవర్తిగా ప్రతిష్టించబడే నాటికి మొఘలులు అనుసరిస్తున్న విధానం ఇది.

మొఘల్ పాలకులలో అనేక మంది జీవితాలు పరిపాలన, త్యాగం, ప్రేమ వంటి అనేక అధ్యాయాలతో నిండి ఉన్నాయి.

మొఘలుల కాలంలో శక్తిమంతులైన స్త్రీలు అనేకమంది వున్నారు. సూరత్ ఓడరేవుపై ఆధిపత్యం సంపాదించిన జహనారా బేగం వారిలో ఒకరు. హుమాయున్‌కు ప్రియమైన భార్య, అక్బర్‌కు తల్లి అయిన హమీదా బాను బేగం, జహంగీర్ కోసం రాజ్యాన్ని పరిపాలించిన నూర్జహాన్ లకు కూడా చరిత్రలో సుస్థిరమైన స్థానం ఉంది.

సంఘ పరివార్ చేస్తున్న ప్రచారానికి భిన్నమైనది ఔరంగజేబు చరిత్ర. ఆయన ఖురాన్, ఇతర గ్రంథాల ప్రతులను తయారు చేయడం ద్వారా వచ్చే ఆదాయంతో జీవించాడు. ఆయన చివరి యుద్ధం గోల్కొండ సుల్తాన్‌తో జరిగింది. సుదీర్ఘ యుద్ధంతో గోల్కొండను జయించాడు. శివాజీ, ఔరంగజేబు మధ్య జరిగిన యుద్ధాలు మాత్రం ప్రచారంలో వున్నాయి. ఔరంగజేబు గోల్కొండలో చేసినటువంటి యుద్ధాలను వలసవాదులు దాచిపెట్టారు. రాజుల చరిత్రలో అధికారం కోసం నిత్యం పోటీ వుండేది. అన్నదమ్ముల మధ్య, తండ్రీకొడుకుల మధ్య, రాజుల మధ్య ఘర్షణలు జరిగాయి. వాటిని మత విద్వేషాలుగా చిత్రించడాన్ని మనం తిరస్కరించాలి. జాత్యహంకారి హిట్లర్‌ను చరిత్ర చెత్తబుట్టలో పడేసిన సంగతి మర్చిపోవద్దు.

భారతీయ సంస్కృతి భిన్నత్వంతో రూపుదిద్దుకుంది. ఆర్యులు, పర్షియన్లు, గ్రీకులు, అరబ్బులు, ఇండో-పార్థియన్లు వంటి వివిధ రకాల ప్రజలను కలుపుకొని భారతీయ సమాజం అభివృద్ధి చెందింది. హిందూత్వ వాదులతో పాటుగా మతతత్వ జాతీయవాదులను ఎదుర్కోవాలంటే... భిన్నత్వంలో ఏకత్వం నిండిన భారతీయ సంస్కృతికి సంబంధించిన చరిత్ర పాఠాలను రూపొందించడం ఎంతైనా అవసరం. చారిత్రిక అభివృద్ధి క్రమంలో ఏర్పడిన అన్ని ఉత్తమ సంప్రదాయాలను మనం ముందుకు తీసుకెళ్లాల్సి వుంది.

/ వ్యాసకర్త 'దేశాభిమాని' చీఫ్ ఎడిటర్ /

15 రోజుల్లో రూ.140 కోట్లు స్వాధీనం

- కర్ణాటకలో ధన ప్రవాహం
- 2018లో కన్నా నాలుగు రెట్లు అధికం

బెంగళూరు : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి పెద్దయెత్తున డబ్బు సంచులను దింపుతోంది. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన మార్చి 29 నుంచి ఈ నెల 12వ తేదీ వరకు అంటే 15 రోజుల్లోనే రూ.140 కోట్ల విలువైన మొత్తాన్ని ఎన్నికల కమిషన్ స్వాధీనం చేసుకుంది. ఇందులో నగదు, మద్యం, డ్రగ్స్, వస్తువులు ఉన్నాయి. ఎన్నికల తేదీ ప్రకటించక ముందు అంటే మార్చి 9 నుంచి మార్చి 29 వరకూ ఎన్నికల కమిషన్ రూ.58 కోట్ల విలువైన నగదు, వస్తువులను స్వాధీనం చేసుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో రాష్ట్రంలోని 81 నియోజవర్గాల్లో ఎన్నికల వ్యయం అధికంగా జరుగుతుందని ఎన్నికల కమిషన్ గుర్తించింది. 2018లో కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇదే సమయానికి స్వాధీనం చేసుకున్న మొత్తం కంటే నాలుగు రెట్లు ఎక్కువగా ప్రస్తుతం స్వాధీనం చేసుకోవడం గమనార్హం. 2018లో ఇదే కాలానికి రూ.34.13 కోట్ల మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. గత ఎన్నికల్లో మొత్తంగా సుమారు రూ.185.74 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో తాయిలాలు ఎక్కువగా పంపిణీ చేసే అవకాశం ఉందని రాష్ట్ర అదనపు చీఫ్ ఎలక్టోరల్ అధికారి వెంకటేశ్ కుమార్ తెలిపారు. శివమొగ్గ, బెంగళూరు నియోజకవర్గాల్లో అత్యధికంగా తాయిలాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. శివమొగ్గలో రూ.4.5 కోట్ల విలువైన బహుమతులను, బెంగళూరులోని బ్యాటరయపురలో రూ. 3.6 కోట్ల విలువైన బహుమతులను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో నగదును పట్టుకోవడంలో పౌరుల పాత్ర కూడా ఉందని ఎన్నికల సంఘం అధికారి తెలిపారు. సి విజిల్ అనే మొబైల్ యాప్ ద్వారా ఇప్పటి వరకు 2,389 ఫిర్యాదులొచ్చాయని తెలిపారు. ఇందులో 1,979 ఫిర్యాదులు వాస్తవమని గుర్తించి, చర్యలు తీసుకున్నామన్నారు.

కర్ణాటకలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

బెంగళూరు : కర్ణాటకలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయింది. అసెంబ్లీ ఎన్నికలకు గురువారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడంతో అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయింది. గురువారం కొంత మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 20 వరకూ గడువు ఉంది. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 24 వరకూ అవకాశం ఉంది. రాష్ట్రంలో మొత్తం 224 అసెంబ్లీ స్థానాలకు మే 10న ఎన్నికలు జరగనున్నాయి. మే 13న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు.

రాహుల్‌పై 20న తీర్పు

సూరత్ : మోదీ ఇంటిపేరుపై చేసిన వ్యాఖ్యలకు గాను దాఖలైన పరువు నష్టం క్రిమినల్ కేసులో తన నేరారోపణపై స్టే ఇవ్వాల్సిందిగా కోరుతూ రాహుల్ గాంధీ చేసుకున్న పిటిషన్‌పై ఈ నెల 20న తీర్పును ప్రకటిస్తామని సూరత్‌లోని సెషన్స్ కోర్టు గురువారం తెలిపింది. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం అదనపు సెషన్స్ న్యాయమూర్తి ఆర్.పి.మొగెరా మాట్లాడుతూ, 20న తీర్పు చెబుతానని ప్రకటించారు. ఈ కేసులో విచారణ సక్రమంగా లేదని రాహుల్ తరపు లాయర్ ఆర్.ఎస్.చీమా వాదించారు. ఈ కేసులో ఇంత గరిష్ట శిక్ష అవసరం లేదన్నారు. మార్చి 23న సూరత్‌లోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు రాహుల్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. రాఫెల్ కేసులో రాహుల్ బేషరతుగా చెప్పిన క్షమాపణను ఈ కేసుకు తప్పుగా జోడించారంటూ రాహుల్ తరపు లాయర్ తప్పుబట్టారు.

గూగుల్‌లో మళ్లీ కోతలు..!

వాషింగ్టన్ : ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్ మరోసారి ఉద్యోగులకు ఉద్వాసన పలకనుందని తెలుస్తోంది. కొత్త ఏడాది జనవరిలో ఓ దఫా 12వేల మంది లేదా మొత్తం ఉద్యోగుల్లో 6 శాతం మందిపై వేటు వేస్తున్నట్లు ప్రకటించింది. తాజాగా మరో రౌండ్‌లోనూ సిబ్బందిని పీకెయ్యాలని యోచిస్తోందని రిపోర్టులు వస్తున్నాయి. మరో దఫా ఉద్వాసనలు ఉండొచ్చని గూగుల్ సిఇఒ సుందర్ పిచాయ్ స్వయంగా వాల్‌స్ట్రీట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

బిబిసి ఇండియాపై ఇడి మరో దాడి ..

న్యూఢిల్లీ : బిబిసి ఇండియాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మరోసారి దాడికి దిగింది. విదేశీ మారకపు ఉల్లంఘనల దర్యాప్తునకు సంబంధించి ఆర్థిక వివరాలను అందించాలని గురువారం ఇడి అధికారులు బిబిసిని కోరారు. బిబిసి ఇండియాకు విదేశాల నుంచి వచ్చిన నగదు వివరాలను ఇడి పరిశీలిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. బిబిసిపై ఇడి విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) కింద కేసు నమోదు చేసినట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఖాతాలు, ఆర్థిక నివేదికలను సమర్పించాలని బిబిసిని కోరినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ప్రారంభంలో బిబిసి ఇండియాపై ఆదాయపు పన్ను శాఖ (ఐటి) దాడులు నిర్వహించి, సోదాలు జరిపిన సంగతి తెలిసిందే. పన్నుల్లో అవకతవకలు, లాభాల మళ్లింపు, నిబంధనలను పాటించకపోవడం వంటి ఆరోపణలపై ఐటి అధికారులు ఢిల్లీ, ముంబయిలోని బిబిసి కార్యాలయాల్లో సోదాలు జరిపారు. విచారణ పేరుతో బిబిసి సిబ్బందిని అర్ధరాత్రి వరకు కార్యాలయాల్లోనే నిలిపివేయడంపై విమర్శలు వచ్చాయి. 2002 గుజరాత్ మారణహోమంలో ప్రధాని మోడీ పాత్రపై బిబిసి ఓ డాక్యుమెంటరీని ప్రసారం చేసింది. "ఇండియా : ది మోడీ క్వశ్చన్" పేరుతో రెండు భాగాల సిరీస్‌ను విడుదల చేసింది. దీంతో మోడి ప్రభుత్వం అత్యవసర అధికారాలను వినియోగిస్తూ ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన లింకులను సోషల్‌మీడియాలో పోస్టు చేయకుండా నిషేధం విధించింది.

అనుమానాస్పదంగా మరో జవాన్ మృతి

- ఉగ్రవాద చర్య కాదు : భటిండా కాల్పులపై పోలీసులు

భటిండా : పంజాబ్‌లో భటిండా ఆర్మీ స్టేషన్‌లో నలుగురు జవాన్ల హత్య ఉగ్రవాద చర్య కాదని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు. ముఖాలను కప్పుకుని వచ్చి, బ్యారక్‌లో నిద్రిస్తున్న నలుగురు జవాన్లను బుధవారం తెల్లవారుజామున హత్య చేసిన దుండగులు తరువాత సమీప అడవుల్లోకి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే. ఎవరు హత్య చేశారనే విషయమై స్పష్టత రాలేదని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసుల విచారణతోపాటు కోర్ట్ ఆఫ్ ఎంక్వయిరీ కూడా జరుగుతోంది.

హత్యలకు, ఆత్మహత్యకు సంబంధం లేదు : ఆర్మీ

బుధవారం సాయంత్రం ఒక జవాన్ ఆత్మహత్య చేసుకుని మరణించాడు. ఈ మేరకు ఇక్కడి కంటోన్మెంట్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు అందిందింది. బుధవారం ఉదయం నలుగురు జవాన్ల హత్యకు, జవాన్ ఆత్మహత్యకు ఎలాంటి సంబంధం లేదని సైన్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. సెంట్రీగా పనిచేస్తున్న ఒక జవాన్ బుధవారం సాయంత్రం 4:30 గంటల సమయంలో తుపాకీతో పేల్చుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు వెల్లడించింది. ఆత్మహత్యకు పాల్పడిన జవాన్‌ను లఘు రాజ్‌శంకర్‌గా గుర్తించారు. ఈ జవాన్ సెలవులు నుంచి తిరిగి వచ్చి బుధవారమే విధుల్లోకి చేరినట్లు ఆర్మీ తెలిపింది.

కాజల్ హిందుస్థానీకి బెయిల్

గాంధీనగర్ : విద్వేష ప్రసంగాలతో గుజరాత్‌లోని ఉనా పట్టణంలో మత ఘర్షణలకు కారణమైన కేసులో కాజల్ హిందుస్థానీకి బెయిల్ లభించింది. ఉనా జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి రేఖా అసోధియా బెయిల్ మంజూరు చేశారు. గురువారం సాయంత్రం జునాగఢ్ జిల్లా జైలు నుంచి కాజల్ విడుదలయ్యారు. గత నెల 30న విహెచ్‌పి నిర్వహించిన శ్రీరామ నవమి కార్యక్రమంలో విద్వేష ప్రసంగం చేసినందుకు ఈ నెల 9న గిర్ సోమనాథ్ పోలీసులు కాజల్‌ను అరెస్టు చేశారు.

సునాక్‌తో మోడీ ఫోన్‌లో సంభాషణ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్రమోడీ బ్రిటిష్ ప్రధాని రిషి సునాక్ గురువారం ఫోన్‌లో సంభాషించుకున్నారు. లండన్‌లో భారత దౌత్య కార్యాలయాల భద్రత అంశాన్ని ప్రధాని మోడీ ఈ సందర్భంగా లేవనెత్తగా భారత్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బ్రిటన్ ప్రధాని సునాక్ హామీ ఇచ్చారని అధికారులు తెలిపారు. బ్రిటన్‌లో తలదాచుకున్న భారతీయ ఆర్థిక నేరగాళ్లను తిరిగి భారత్‌కు పంపాలని ప్రధాని కోరారని అధికారవర్గాలు తెలిపాయి.

ఐడిబిఐ పోటీలో ఐదు సంస్థలు

- ప్రయివేటీకరణ ప్రక్రియ వేగవంతం

న్యూఢిల్లీ : ఐడిబిఐ బ్యాంక్‌ను స్వాధీనం చేసుకోవడానికి ఐదు ప్రయివేటు రంగ సంస్థలు పోటీలో నిలిచాయి. ఐదు సంస్థల బిడ్డింగ్‌ల ప్రక్రియను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మూల్యాంకనం చేస్తుందని రాయిటర్స్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. ఐడిబిఐ చేజిక్కించుకోవడానికి కొటాక్ మహీంద్రా బ్యాంక్, ప్రేమ్ వాట్సాకు చెందిన సిఎస్‌బి బ్యాంక్, ఎమిరైట్స్ ఎన్‌బిడి తదితర సంస్థలు ఆసక్తి కనబర్చుతూ బిడ్డింగ్ వేశాయని సమాచారం. దీనికి సంబంధించిన చర్చలు రహస్యంగా జరుగుతున్నాయని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఐడిబిఐ బ్యాంక్‌లో కేంద్రానికి 45.48 శాతం వాటా ఉండగా.. ఇందులో 30.48 శాతం వాటాను అమ్మకానికి పెట్టింది. అదే విధంగా ఎల్‌ఐసికి 49.24 శాతం వాటా ఉండగా... 30.24 శాతం వాటాను విక్రయించనుంది. దీంతో మెజారిటీ వాటాలు ప్రయివేటు శక్తులకు చెందనున్నాయి.

రాష్ట్రంలో 13 స్టోర్లకు విస్తరించిన క్రోమా

హైదరాబాద్ : టాటా గ్రూప్‌కు చెందిన గృహోపకరణాల రిటైలర్ క్రోమా ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా మూడు స్టోర్లను తెరిచినట్లు ప్రకటించింది. మదనపల్లె, ఒంగోలు, విజయవాడలో కొత్త స్టోర్‌లను ఏర్పాటు చేయడంతో రాష్ట్రంలో 13 అవుట్‌లెట్‌లకు విస్తరించినట్లయ్యిందని పేర్కొంది. తమ స్టోర్లలో 550 కు పైగా బ్రాండ్లకు చెందిన 16వేలకు పైగా ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని ఆ సంస్థ వెల్లడించింది.

ఇన్ఫోసిస్‌లో తగ్గిన ఉద్యోగులు

బెంగళూరు : దేశంలో రెండో అతిపెద్ద ఐటి కంపెనీ ఇన్ఫోసిస్ 2023 మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో ఏడాదికేడాదితో పోల్చితే కంపెనీ లాభాలు 8 శాతం పెరిగి రూ.6,128 కోట్ల లాభాలు సాధించింది. ఇదే సమయంలో కంపెనీ రెవెన్యూ 16 శాతం పెరిగి రూ.37,441 కోట్లకు చేరింది. క్యూ4లో టిసివికి చెందిన 2.1 బిలియన్ డాలర్ల కొత్త ప్రాజెక్టును దక్కించుకున్నట్లు ఇన్ఫోసిస్ తెలిపింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.17.50 డివిడెండ్‌ను ప్రకటించింది. 2023 డిసెంబర్ 31 నాటికి కంపెనీలో మొత్తం ఉద్యోగులు 3,43,234గా ఉన్నారు. ఇంతక్రితం ఏడాది ఇదే కాలం నాటికి 3,46,845 మంది ఉద్యోగులున్నారు. దీంతో పోల్చితే నికరంగా 3,611 మంది తగ్గిపోయారు. గురువారం బిఎస్‌ఇలో ఇన్ఫోసిస్ షేర్ 2.79 శాతం తగ్గి రూ.1,388 వద్ద ముగిసింది.

మా కథనానికి కట్టుబడి ఉన్నాం

- అదాని డిమాండ్‌కు తిరస్కరణ
- ఫైనాన్షియల్ టైమ్స్ స్పష్టీకరణ

లండన్ : అదాని గ్రూపు ఆర్థిక అవకతవకలకు వ్యతిరేకంగా ప్రచురించిన ఓ కథనాన్ని తొలగించాలని ఫైనాన్షియల్ టైమ్స్‌పై ఒత్తిడి తీసుకు రాగా.. ఆ సంస్థ తిరస్కరించింది. లండన్ కేంద్రంగా పని చేస్తున్న వ్యాపార వార పత్రిక ఫైనాన్షియల్ టైమ్స్ (ఎఫ్‌టి) మార్చి 22న అదాని అక్రమ విదేశీ నిధులపై ఓ కథనాన్ని ప్రచురించింది. దీన్ని వెబ్‌సైట్ నుంచి తొలగించాలని అదాని గ్రూపు ఈ నెల 10న ఆ సంస్థకు లేఖ రాసింది. "మా కథనం కచ్చితమైనది. జాగ్రత్తగా తయారు చేశాం. మేము మా రిపోర్టింగ్‌కు కట్టుబడి ఉన్నాం." అని ఎఫ్‌టి ప్రతినిధి టెలిగ్రాఫ్‌తో పేర్కొన్నారు. "గౌతం అదానీ కంపెనీల్లోకి ఇటీవలి సంవత్సరాలలో దాదాపు సగం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆయన కుటుంబానికి అనుసంధానించబడిన విదేశాల్లోని సంస్థల నుంచి వచ్చాయి. ఈ నగదు ప్రవాహాన్ని పరిశీలించడం కష్టంగా ఉంది. అదానీలతో సంబంధమున్న విదేశీ కంపెనీలు 2017 నుంచి 2022 మధ్య కనీసం 2.6 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.21వేల కోట్లు) పెట్టుబడి పెట్టాయి. ఆ సమయంలో వచ్చిన మొత్తం 5.7 బిలియన్ డాలర్లలో దాదాపు సగం (45.4%)గా నమోదయ్యాయి. ప్రధాని నరేంద్ర మోడీ అభివృద్ధి ఎజెండాతో తనను తాను కలుపుకుంటూనే అదాని ట్రేడింగ్, ప్లాస్టిక్‌ల కార్యకలాపాలను మౌలిక సదుపాయాల దిగ్గజంగా విస్తరించుకోవడానికి అస్పష్టమైన నిధులు సహాయపడ్డాయి. అదానీ గ్రూపులోకి కనెక్ట్ చేయబడిన ఆఫ్‌షోర్ సంస్థల నుంచి పూర్తిస్థాయిలో డబ్బు ప్రవహిస్తుంది. విదేశీ పెట్టుబడిలో కొంతభాగాన్ని మాత్రమే ఎఫ్‌డిఐ డేటా బహిరంగం చేస్తుంది. సెప్టెంబర్ 2022 వరకు అధికారికంగా ఎఫ్‌డిఐగా నమోదు చేయబడిన సొమ్ములో అత్యధికంగా ఆరు శాతం డబ్బును స్వీకరించిన వాటిలో అదానీ గ్రూప్ ఒకటి." అని ఎఫ్‌టి తన కథనంలో పేర్కొంది. ఇది అదాని గ్రూపును ఆందోళనకు గురి చేసింది. దీంతో ఎఫ్‌టి వెబ్‌సైట్ నుంచి ఆ కథనాన్ని తొలగించాలని డిమాండ్ చేసింది.

నీట్ -యుజి పరీక్షల రిజిస్ట్రేషన్ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ : నీట్ యుజి పరీక్షల రిజిస్ట్రేషన్ గడువును కేంద్రం పొడిగించింది. దరఖాస్తు గడువు మరో రెండు రోజులు పొడిగించినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) గురువారం ప్రకటించింది. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. వాస్తవానికి రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ ఏప్రిల్ 12. రిజిస్ట్రేషన్‌ను పూర్తి చేయలేని అభ్యర్థుల కోసం ఈ గడువును పొడిగించినట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

ఇటలీలో 6 నెలలు ఎమర్జెన్సీ

రోమ్ : ఇటలీ ప్రభుత్వం ఆరు నెలల పాటు ఎమర్జెన్సీ విధించింది. దేశంలోకి గణనీయంగా వలసదారులు ప్రవేశిస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇటలీ క్యాబినెట్ ప్రకటించింది. స్థానిక మీడియా విడుదల చేసిసన నివేదిక ప్రకారం.. గడిచిన 72 గంటల్లో మూడు వేల మంది వలసదారులు మధ్యధరా సముద్రం మీదుగా ఇటలీ చేరుకున్నారని, వారి వద్ద సరైన పత్రాలు లేవని సమాచారం. ఈ ఏడాది ప్రారంభం నుండి వలసదారుల ప్రవాహం నాలుగు రెట్లు పెరిగిందని, మార్చి నెల చివరి నాటికి 30 వేల మంది దేశంలోకి ప్రవేశించినట్లు వెల్లడించింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండర్ నోటీసు

నెం.: 02/2023/టి.ఓ, నిట్ నం.3 టూ 13, తేది: 10.04.2023

గుంటూరు జిల్లా పరిధిలోని వివిధ నియోజకవర్గములలో 11 పనులకు అంచనా విలువ: రూ.76.00 లక్షలతో వివిధ గ్రాంట్ల క్రింద మంజూరైన పనులకు టెండర్లు ది.17.04.2023 నుండి ఇ-మార్కెట్ ప్లేస్ **www.apeprocurement.gov.in** ద్వారా కోరబడుచున్నవి.

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు,
(పి.ఆర్) పి.ఐ.యు. డివిజన్, గుంటూరు.

DIPRNo:9152/CL/ADVT/1/1/2021-22

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డు ఆఫీసు: శ్రీ టవర్స్, ప్లాట్ నం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గ్యూండి, చెన్నై-600032.
అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు: 6వ అంతస్తు (లెవెల్ 2), బిల్డింగ్ నం. క్యూ2, ఆరుం క్యూ పార్క్, జెన్ 4/1, టిటిసి, థాణే బేలాపూర్ రోడ్, ఘన్‌సోలి, నేవి ముంబయి-400710.

స్వాధీనతా ప్రకటన

ఏదైతే, క్రింది సంతకందారు **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** (గతంలో "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్"గా పేరుగలది) శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్‌తో విలీనమై మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్టు ఫైనాన్స్ లిమిటెడ్‌గా మార్పుచెందిన దాని యొక్క అధీకృత అధికారిగా క్రింది సంతకందారు, తేది: 13.11.2022నాటి ఇన్‌కార్పొరేషన్ సర్టిఫికేట్ ద్వారా **శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్** గా పేరు పొందినది, భారత కంపెనీల చట్టం, 1956 క్రింద కంపెనీగా రిజిస్టరై మరియు నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ బిజినెస్‌గా చేయుటకు దీని **రిజిస్టర్డు ఆఫీసు: శ్రీ టవర్స్, ప్లాట్ నం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గ్యూండి, చెన్నై-600032 మరియు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసు 6వ అంతస్తు, (లెవెల్ 2), బిల్డింగ్ నం. క్యూ2, ఆరం క్యూ పార్క్, జెన్ 4/1, టిటిసి, థాణే బేలాపూర్ రోడ్, ఘన్‌సోల్, నేవి ముంబై 400710** వద్ద కలిగియుండి, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (సదరు చట్టం) క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (సదరు రూల్స్) యొక్క రూల్ 3తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని దిగువ వివరాలు ఏవైతే దిగువ పట్టికలో పేర్కొన్న మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ రుణగ్రహీతలకు డిమాండ్ నోటీసులు జారీచేసి, సదరు డిమాండ్ నోటీసుల్లో పేర్కొన్న మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.రుణగ్రహీతలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని **11 మార్చి, 2023న స్వాధీనంచేసుకున్నారు.**

రుణగ్రహీత పేరు & చిరునామా	డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తాలు
1. మరళీకృష్ణ మన్నె, తండ్రి. మన్నె వెంకట రామారావు, 62 సం॥లకు పైన, ఓసిసి : ఎటిజి ఇన్ఫార్మాటిక్స్ ఇండియా (ప్రై) లిమిటెడ్, ఆర్/ఓ. ప్లాట్ నం.256, 5వ అంతస్తు, ఎటెర్నల్ సామ్యులత టవర్స్, హైటెక్‌సిటీ రోడ్డు, విట్టల్ రావు నగర్, హైదరాబాద్-500081. ఫోన్ : 9848045696 (ఆస్తి హక్కుదారు). మరియు ఇక్కడ కూడా: మురళీ కృష్ణ మన్నె, తండ్రి. మన్నె వెంకట రామారావు, ఆర్/ఓ. హౌ.నం.51-3-18, గుణదల వెంకట రామారావు వీధి, ఎన్‌టిఆర్ యూనివర్శిటీ ప్రక్కన, మాచవరం, విజయవాడ, కృష్ణాజిల్లా-520004. 2. ఇ.అనిల్ కుమార్, తండ్రి. ఇ.నారాయణ, వయసు 49 పైన, ఆర్/ఓ. ప్లాట్ నం.256, 5వ అంతస్తు, ఇటెర్నల్ శామ్యులత టవర్స్, హైటెక్ సిటీ రోడ్డు, విట్టల్ రావు నగర్, హైదరాబాద్-500081. ఫోన్ : 9000203366. 2వ చిరునామా : ఆర్/ఓ. హౌ.నం.76/ఎ, ఫేజ్-2, రోడ్డు నం.10, కో-ఆపరేటివ్ సొసైటీ, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033. 3. కె. రాజేష్, తండ్రి. కె. మల్లయ్య, వయసు 50 సం॥ పైన, ఆర్/ఓ. హౌ.నం.3-12/117/7సి, పిఎస్ కాలనీ, రామాంతపూర్, ఉప్పల్, హైదరాబాద్-500013. ఫోన్ :9949045642. 4. ఇ. సుహాసిని, భర్త. అనిల్ కుమార్, వయసు 42 సం॥ పైన, ఆర్/ఓ. ప్లాట్ నం.256, 5వ అంతస్తు, ఇటెర్నల్ శామ్యులత టవర్స్, హైటెక్ సిటీ రోడ్డు, విట్టల్ రావు నగర్, హైదరాబాద్-500081. ఫోన్ : 9000497585. 2వ చిరునామా: ఆర్/ఓ. హౌ.నం.76/ఎ, ఫేజ్-2, రోడ్డు నం.10, కో ఆపరేటివ్ సొసైటీ, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.	రూ. 36,96,671/- (ముప్పై ఆరు లక్షల తొంభై ఆరు వేల ఆరు వందల డెభై ఒక రూపాయలు మాత్రమే)

స్థిరాస్తి వివరణ: SECU5TF1707250001- స్థిరాస్తి యొక్క వివరణ (ఆస్తి హక్కుదారు పేరు మరళీకృష్ణ మన్నె, తనఖా డీడ్ తేది 24.07.2017న గన్నవరం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు యొక్క ఫైల్‌పై డాక్యుమెంట్ నం.4780/2017 గా నమోదు చేయబడింది) : కృష్ణాజిల్లా, గన్నవరం సబ్ రిజిస్ట్రీ, చిన్నవుటుపల్లి గ్రామం మరియు గ్రామ పంచాయతీ యొక్క సైట్ యొక్క మొత్తం ఆ విస్తీర్ణం 208.6 చ.గ.లు. లేదా 174.13 చ.మీ.లు. (ప్లాట్ నం.305) మరియు ఆర్‌సిసి భవనం కలిగి ఉన్న ఎల్.పి.నం.37/2008లో ఆర్.ఎస్.నం.177/2 లో గ్రౌండ్ ఫ్లోర్ ఫ్లింత్ ఏరియా 765.42 చ.అ.లు., మూల్యాంకనం నం.363 కింద భార్గవి నగర్, బేరింగ్ డో.నం.2-155 మరియు క్రింది విధమైన హద్దులు: తూర్పు వైపు : సిహెచ్. కమలాదేవి యొక్క ప్లాట్ నం.306 ఆస్తి-34.1 అడుగులు., పడమర వైపు : లే అవుట్ ప్లాన్ ప్రకారం 40 అడుగుల వెడల్పు రోడ్డు-34.1 అడుగులు., ఉత్తరం వైపు : కడియాల సునీల్ కుమార్ యొక్క ప్లాట్ నం.304 ఆస్తి-55 అడుగులు., దక్షిణం వైపు : పాసేజ్ 55 అడుగులు.

ఇందుమూలంగా ప్రకటన ద్వారా సర్వజనులను హెచ్చరించడమేమనగా, **ఎస్‌ఎఫ్‌ఎల్** యొక్క అధీకృత అధికారి, ఇందు పై పేర్కొన్న స్థిరాస్తిని చట్టబద్ధ **స్వాధీనం చేసుకున్నారు** మరియు రుణగ్రహీతలు లేదా ఎవరైనా వ్యక్తి ఈ నోటీసు స్వీకరించిన తరువాత **ఎస్‌ఎఫ్‌ఎల్** యొక్క ముందస్తు అనుమతి లేకుండా, ఈ ప్రకటనలో పేర్కొన్న పై పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్స్‌ను అమ్మకం, లీజు లేదా ఇతర విధానాల ద్వారా లావాదేవీలు జరుపుటకు బదలాయింపు చేయలేరని గమనించగలరు

ప్రదేశం: చిన్నవుటుపల్లి, తేది: 14.04.2023 — సం- అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

జమ్మూకాశ్మీర్ అంశం తొలగింపు

- మౌలానా ఆజాద్ గురించి కూడా..
- 11వ తరగతి రాజనీతి శాస్త్రం నుంచి
- ఎన్‌సిఇఆర్‌టి చర్యపై చరిత్రకారులు, విద్యావేత్తలు, నిపుణుల ఆందోళన

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం భారత దేశ చరిత్రను మరుగునపరిచేందుకు పాఠ్యపుస్తకాల నుంచి కీలక అంశాలు, భాగాలు, పేరాలు, ప్రకటనలను తొలగిస్తున్నది. చరిత్రను కాషాయీకరించే యత్నాల్లో భాగంగా మొఘలుల పాలన, గాంధీజీ హత్య వంటి కొన్ని ముఖ్యమైన అంశాలను పాఠ్య పుస్తకాల నుంచి తొలగించేసింది. తాజాగా భారత్‌లో జమ్మూకాశ్మీర్ విలీనానికి సంబంధించిన ప్రకటనను 11వ తరగతికి చెందిన పొలిటికల్ సైన్స్ పుస్తకం పదో చాప్టర్ నుంచి ఎన్‌సిఇఆర్‌టి పూర్తిగా ఎత్తివేసింది.

జమ్ముకాశ్మీర్ భారత్‌లో విలీనమైన తర్వాత అది స్వయంప్రతిపత్తిని కలిగి ఉంటుందన్న హామీ మీద ఆధారపడి విలీన ప్రక్రియ జరిగిందన్నది ప్రకటన కీలకాంశం. ఈ ప్రత్యేక అంశాన్ని రాబోయే తరం తెలుసుకోకుండా మోడీ సర్కారు పుస్తకాల నుంచి తొలగించిందని విద్యావేత్తలు, నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు.

జమ్ముకాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని కల్పించే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, 35(ఎ) లను మోడీ సర్కారు తన రెండో టర్మ్ పాలనలో రద్దు చేసిన విషయం విదితమే. ఈ ఆర్టికల్‌ల రద్దు తర్వాత ప్రతిపక్షాలు, జమ్ముకాశ్మీర్‌లోని పౌర సంఘాలు, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మోడీ సర్కారు నియంతృత్వ ధోరణిని తప్పుబట్టాయి. ఇది జమ్మూకాశ్మీర్ ప్రజల హక్కులను హరించడమేనని ఆందోళన వ్యక్తం చేశాయి.

భారత తొలి విద్యా శాఖ మంత్రిగా పని చేసి గొప్ప పేరు సంపాదించిన మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌కు చెందిన అన్ని రిఫరెన్సులను సైతం తొలగించడం గమనార్హం. పాత 11వ తరగతి పొలిటికల్ సైన్స్ పుస్తకం " ఇండియన్ కానిస్టిట్యూషన్ ఎట్ వర్క్"లోని మొదటి చాప్టర్ నుంచి ఆజాద్‌కు సంబంధించిన అన్ని రిఫరెన్సులు తొలగించడం గమనార్హం.

ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలలో మొఘల్ చరిత్ర, ఆర్‌ఎస్‌ఎస్‌పై నిషేధం, హిందూ-ముస్లింల ఐక్యతకు గాంధీ చేసిన కృషి వంటి అంశాలతోపాటు తాజాగా పైన పేర్కొన్న విషయాలనూ తొలగించడంపై దేశంలోని చరిత్రకారులు, విద్యానిపుణులు, సామాజికవేత్తల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలాన్ని అమలు చేసే ప్రక్రియలో భాగమే ఈ మార్పులని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

ఇలా చేస్తే భారత దేశ వాస్తవ చరిత్రను విద్యార్థులు తెలుసుకోలేరనీ, ఇది దేశ అస్థిత్వానికే ప్రమాదమని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో మోడీ ప్రభుత్వం హేతుబద్ధంగా ముందుకు వెళ్లాలనీ, విద్యా నిపుణుల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవాలని వారు తెలిపారు.

మౌలానా ఆజాద్ పేరు తొలగింపు దారుణం : సీతారాం ఏచూరి

'పాఠ్యపుస్తకాల నుంచి మౌలానా ఆజాద్ గురించి ప్రస్తావన తొలగించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతీకార ధోరణితో చరిత్రను తిరగరాయడం, తప్పుడు భాష్యాలు చెప్పడం వంటివి ఆధునిక భారత దేశపు పునాదులుగా వున్న అన్ని పురోగామి నాగరికతలను నాశనం చేస్తుంది ' అని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ట్వీట్ చేశారు. దీని వల్ల ప్రపంచం ముందు భారత దేశ ప్రతిష్ట మసకబారుతుందని ఆయన అన్నారు.

దేశాన్ని కాపాడుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

మౌనంగా ఉంటే మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిలు మాత్రం ప్రజలను పక్కదారి పట్టించేలా మాట్లాడుతున్నారన్నారు. కనీస అవగాహన లేకుండా పొంతన లేని విషయాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపితో కుమ్మక్కై రాష్ట్రప్రయోజనాలను పణంగా పెట్టడాన్ని అంగీకరించబోమన్నారు. ఉక్కు పరిరక్షణ కోసం ట్రేడ్ యూనియన్లు, వామపక్షాలు గట్టిగా నిలబడుతున్నాయని, చేతనైతే రాష్ట్రప్రభుత్వం కూడా అండగా నిలవాలని కోరారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న కమ్యూనిస్టులపై అవాకులు, చవాకులు మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. ముడిసరుకు, పెట్టుబడి కోసం ఉక్కు ఫ్యాక్టరీ బిడ్డింగ్ పిలిస్తే తెలంగాణ ప్రభుత్వం కూడా వేసిందన్నారు. బిడ్డింగ్ వేయడం రాష్ట్రప్రభుత్వానికి చేతగావడం లేదా అని ప్రశ్నించారు. ఉక్కును కాపాడుకునేందుకు రాష్ట్రప్రభుత్వం ముందుకు రావాలని, ఇతర పార్టీలతో కలుపుకుని ఢిల్లీ యాత్ర చేపట్టాలని కోరారు. మోడీతో మాట్లాడి ఫ్యాక్టరీకి ముడిసరుకు, పెట్టుబడులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ బిజెపి హఠావో, దేశ్‌క్ బచావో అనే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం దేశానికి ఏం చేసింది? ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేసిందా? కార్పొరేట్లకు కొమ్ము కాసిందా? అనే అంశాలపై చర్చ జరగాలని కోరారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, నల్లధనం వెనక్కి తీసుకొస్తామని, ధరలను నియంత్రిస్తామని 2014 ఎన్నికల సమయంలో మోడీ హామీలు ఇచ్చారని గుర్తుచేశారు. వీటిల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ఉద్యోగాల కల్పన లేదని, రైతుల ఆదాయం రెట్టింపు కాలేదని, నిత్యావసర ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.400ఉంటే బిజెపి నాయకులు ధర్నాలు చేశారని, ప్రస్తుతం సిలిండర్ రూ.1200లకు చేరుకుందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు సెంచరీ దాటాయని వీటిపై కేంద్రమంత్రులు, బిజెపి నాయకులు ఒక్క మాట కూడా మాట్లాడటం లేదన్నారు. కేంద్రప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ము కాస్తూ అంబానీ, అదానీల ఆస్తులు పెంచేందుకు ఉత్సాహం చూపుతోందన్నారు. పేదలు, నిరుద్యోగులు, రైతుల సమస్యలను పరిష్కరించలేకపోయారని విమర్శించారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. విభజన హామీలు అమలు చేయలేదని, పదేళ్లు ఇస్తామన్న ప్రత్యేక హోదాను ముగిసిన అధ్యాయం అంటున్నారని తెలిపారు. కడపలో స్టీల్ ఫ్యాక్టరీ, రామాయపట్నం పోర్టు ఏర్పాటు కాలేదన్నారు. విశాఖ రైల్వేజోన్‌కు నిధులు ఇవ్వలేదన్నారు. విశాఖ స్టీల్‌ను అదానీకి అప్పగించేందుకు నరేంద్రమోడీ, జగన్ లాలూచీ పడుతున్నారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో ప్రచార భేరి సాగుతుందని తెలిపారు. ఈ భేరి తరువాత ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. నరేంద్రమోడీ గద్దె దిగేవరకు పోరాటాల్లో, ఎన్నికల్లో కలిసి కట్టుగా ముందుకెళ్లి దేశానికి పట్టిన పీడను వదిలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, సిహెచ్ బాబూరావు, వి వెంకటేశ్వర్లు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్ పాల్గొన్నారు.

రాష్ట్రాల స్థాయిలో సీట్ల సర్దుబాటు

(మొదటి పేజీ తరువాయి)

ముందుంటుందని తెలిపారు.

ప్రతిపక్షాల ఓట్లను ఏకీకృతం చేయడం వల్ల కేవలం 37 శాతం ఓట్లు వచ్చిన పార్టీ (బిజెపి) అధికారంలోకి వచ్చే పరిస్థితి రాదని అన్నారు. ప్రతిపక్షాల ఐక్యత ఇప్పుడు గణనీయంగా ఊపందుకుందని, వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య పార్టీల ఐక్యతతోనే బిజెపిని ఓడించవచ్చని పేర్కొన్నారు. 1996, 1998, 2004 మాదిరిగా ఎన్నికల తరువాతే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే కూటమి ఏర్పడుతుందని స్పష్టం చేశారు. త్వరలో ప్రతిపక్ష పార్టీల సమావేశం నిర్వహించి వ్యూహాలు రచించనున్నట్లు తెలిపారు. రాజ్యాంగాన్ని, దేశాన్ని పరిరక్షించేందుకు, ప్రజల జీవనోపాధిని కాపాడుకునేందు బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు.

రాజకీయ ఏకాభిప్రాయం కుదిరాకా నిర్ణయం : రాజా

ప్రతిపక్షాల మధ్య రాజకీయంగా ఏకాభిప్రాయం కుదిరిన తరువాతే మిగతా విషయాలపై నిర్ణయం తీసుకుంటామని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా స్పష్టం చేశారు. బీహార్ ముఖ్యమంత్రి, జెడి (యు) నేత నితీష్ కుమార్‌తో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నితీష్ పాత్రను అందరూ నిర్ణయించాల్సి ఉందని అన్నారు. "ఆర్‌ఎస్‌ఎస్-బిజెపికి వ్యతిరేకంగా ప్రతిపక్ష ఐక్యతపై చర్చించాం. దేశం గందరగోళంలో ఉంది. సమాజంలోని అన్ని వర్గాలు బిజెపి దుష్పరిపాలనకు వ్యతిరేకంగా గళం విప్పుతున్నాయి. లౌకిక, ప్రజాస్వామ్య శక్తుల ఐక్యత ప్రజాస్వామ్యాన్ని, ప్రజలను రక్షించడం తప్పనిసరి" అని అన్నారు.

మద్దతిస్తామని ఆప్ హామీ

నితీష్ కుమార్ ఐక్య ప్రయత్నాలకు పూర్తిస్థాయిలో మద్దతిస్తామని ఇప్పటికే ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్ ప్రకటించారు. కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులతో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా జైలు పాలైన తరువాత బిజెపి పట్ల కేజ్రీవాల్ వైఖరిలో మార్పు వచ్చింది. అంతకుముందు, ప్రతిపక్షాల ఐక్య ప్రయత్నాలకు దూరంగా ఉండటమే ఆప్ విధానంగా ఉండేది. ఒడిశాలో బిజెపి విధ్వంసక ప్రయోగాలను ప్రారంభించినందున బిజెడి కూడా ప్రతిపక్ష కూటమిలో చేరవచ్చనే చర్చ జరుగుతోంది. మూడు రోజుల ఢిల్లీ పర్యటనలో ఉన్న నితీష్ కుమార్ శుక్రవారం ఎస్‌పి నేత అఖిలేష్ యాదవ్‌తో భేటీ కానున్నారు.

MOTILAL OSWAL HOME LOANS
మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టార్ ఆఫీసు: మోతీలాల్ ఓస్వాల్ టవర్, రహిమ్‌తుల్లా సయాని రోడ్, పారెల్ ఎస్‌టి డిపోట్ ఎదురుగా, ప్రభాదేవి, ముంబయి-400025. టెలి: (022) 47189999,
Website: www.motilaloswalhf.com, Email: hfquery@motilaloswal.com

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద ప్రకటన

సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 (సదరు రూల్) యొక్క రూల్ 3(1)తో చదువగల సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్ 2002 (సదరు చట్టం) యొక్క సెక్షన్ 13(2) క్రింద, సదరు రూల్ యొక్క రూల్ 3తో చదువగల సదరు చట్టం యొక్క సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఆధీకృత అధికారి సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసులను జారీచేసి, వారికి జారీచేయబడిన సదరు డిమాండ్ నోటీసుల్లో పేర్కొన్న రుణ మొత్తంను తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీతలు, హామీదారులను కోరినారు. పై నోటీసుకు సంబంధించి, డిమాండ్ నోటీసు తేది(ల) నుండి చెల్లింపులుచేయువరకు తదుపరి వడ్డీతోపాటు, దిగువ సూచించిన మొత్తాలను, ఈ నోటీసు ప్రచురిత 60 రోజుల్లోగా అన్ని పార్టీలకు చెల్లించుటకు మరోసారి కోరబడుచున్నది. డిమాండ్ నోటీసు తేదీన రుణగ్రహీత(ల) బకాయి మొత్తం మరియు రుణ మొత్తంను తిరిగి చెల్లించుటకుగాను ఆఫర్‌చేసిన సెక్యూరిటీ యొక్క వివరాలు క్రింది విధంగా ఉన్నవి:

క్ర. సం	రుణ ఒప్పంద నెం./రుణగ్రహీత(ల)/సహ-రుణగ్రహీత(ల)/సహ-అప్లికెంట్ పేరు/హామీదారుల యొక్క పేరు	డిమాండ్ నోటీసు తేది మరియు మొత్తం	సెక్యూర్డ్ అసెట్(ల) వివరణ (స్థిరాస్తి/లు)
1.	LXMOVIJAYW721-220624546 వెంకట రమణ మూర్తి పోలిమెరు/ మాధవి పోలిమెరు	08-మార్చి-23/ రూ॥ 23,17,970/- (ఇరవై మూడు లక్షల పదిహేడు వేల తొమ్మిది వందల డెభై రూపాయలు మాత్రమే)	"వెంకట లక్ష్మి రెసిడెన్సీ" గ్రౌండ్ ఫ్లోర్, ఫ్లాట్ నం.102, ప్లాట్ నం.36 మరియు 25, ఎస్‌వై.నం.559/1, గొల్లపుడి గ్రామ పంచాయతీ, సాయి షణ్ముఖ రెసిడెన్సి వద్ద, కరీంనగర్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్-521225.

పైన చెప్పినట్లుగా ఎహెచ్‌ఎఫ్‌సిఎల్‌కు చెల్లింపులుచేయుటలో ఒకవేళ సదరు రుణగ్రహీతలు విఫలం చెందిన పక్షంలో, ఎహెచ్‌ఎఫ్‌సిఎల్ చట్టం యొక్క సెక్షన్ 13(4) మరియు వర్తించు రూల్స్ క్రింద ఖర్చులు మరియు ఫలితంగా సదరు రుణగ్రహీతల పూర్తి బాధ్యత పై సెక్యూర్డ్ అసెట్స్ పై చర్యలు తీసుకొంటుంది. సదరు రుణగ్రహీతలు ఎహెచ్‌ఎఫ్‌సిఎల్ యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతిలేనిదే అమ్మకం, లీజు లేదా ఇతర రూపాలలో పైన చెప్పిన ఆస్తుల బదిలీ నుండి చట్టం క్రింద నిషేదింపబడినారు. సదరు చట్టం లేదా దాని క్రింద రూపొందించిన రూల్స్ యొక్క నియమాల వివాదాలు లేదా సమస్యలను తక్కువచేయు ఎవరైనా వ్యక్తి, చట్టం క్రింద ఇవ్వబడినట్లుగా జేలు మరియు/లేదా జరిమానాకి ఆస్కారం ఉంటుంది.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్
తేది: 14.04.2023
సం/- అధీకృత అధికారి,
(మోతిలాల్ ఓస్వాల్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్)

*అనువాదంలో వ్యత్యాసం ఉన్నట్లయితే, ఇంగ్లీష్ వర్షన్‌ను పరిగణించగలరు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
(భారత ప్రభుత్వరంగ సంస్థ)
ఆంధ్రా Andhra — కార్పొరేషన్ Corporation
బెంజ్ సర్కిల్ శాఖ,
సితార టవర్స్, యన్.సి.బి.యన్ కాలని,
విజయవాడ-520010. ఫోన్: 0866-2496647.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియజేస్తూ ప్రకటన (30 రోజుల నోటీస్) (సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క నిబంధన 6(2)/8(6) ప్రకారం)

చీఫ్ మేనేజర్, అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, (యాక్ట్ 54 ఆఫ్ 2002 ప్రకారం) వారి నుండి

దిగువ వారికి

ఋణగ్రహీతలు మరియు స్థిరాస్తి వివరములు

ఋణగ్రహీత(లు) మరియు తనఖాదారు/హామీదారుల పేర్లు మరియు చిరునామా: 1) శ్రీ ఇమ్మడిశెట్టి నాగ సుకుమార్, తండ్రి: ఐ.రామ్ కుమార్, **2) శ్రీ ఇమ్మడిశెట్టి రామ్ కుమార్,** తండ్రి: ఐ.వెంకట సుబ్బయ్య, **3) శ్రీమతి ఇమ్మడిశెట్టి నాగ సాయి సౌందర్య,** తండ్రి: ఐ.రామ్ కుమార్, డి.నెం.40-15-9, నందమూరి రోడ్, బృందావన్ కాలనీ, విజయవాడ-10. **4) శ్రీ ఇమ్మడిశెట్టి నాగ సుకుమార్,** తండ్రి: ఐ.రామ్ కుమార్. **5) శ్రీ ఇమ్మడిశెట్టి రామ్ కుమార్,** తండ్రి: ఐ. వెంకట సుబ్బయ్య. **6) శ్రీమతి ఇమ్మడిశెట్టి నాగ సాయి సౌందర్య,** తండ్రి: ఐ.రామ్ కుమార్, ఫ్లాట్ నెం. 301, సాయి భగవతి అపార్ట్‌మెంట్, రామకోటి గుడి పక్కన, బి.ఆర్.టి.యస్ రోడ్, గాంధీనగర్, విజయవాడ-520003.

స్థిరాస్తి వివరములు: షెడ్యూల్-ఎ: కృష్ణాజిల్లా, విజయవాడ, రామానగరం, పాత అసెస్మెంట్ నెం.14821, మున్సిపల్ వార్డ్ నెం.18, యన్.టి.యస్.నెం.720/సి, డి.నెం.24-28-45లో మొత్తం 1040 చ.గ.ల విస్తీర్ణంలో 40 చదరపు గజాలలో ఉన్న ఇంటి స్థలం. ఈ దిగువ హద్దులలో **తూర్పు:** ఎడ్యుకేషనల్ సొసైటీ ఆస్తి (శారదా కళాశాల), **దక్షిణం:** పిసిపాటి వెంకటేశ్వర్లు గారి ఆస్తి, **పడమర:** మున్సిపల్ రోడ్, **ఉత్తరం:** బి.ఆర్.టి.యస్ రోడ్. ఈ నాలుగు సరిహద్దుల మధ్య 1040 చ.గ.లు లేదా 869.57 చ.మీ.ల స్థలంలో ఉమ్మడి అవిభక్త 40 చ.గ.లు లేదా 33.445 చ.మీ.ల స్థలం. **షెడ్యూల్-బి:** పైన పేర్కొన్న షెడ్యూల్-ఎ ఆస్తి మొత్తం విస్తీర్ణంలో "సాయి భగవతి టవర్స్" పేరుతో మరియు శైలిలో నిర్మించిన అపార్ట్‌మెంట్ 3వ అంతస్తులో ఫ్లాట్ నెం.301 ఇమ్మడిశెట్టి రామ్ కుమార్, తండ్రి: ఐ.వెంకట సుబ్బయ్య గారికి చెందినది ఈ దిగువ హద్దులలో **తూర్పు:** ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నెం.304 మధ్య ఉమ్మడి గోడ, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఓపెన్ టు స్కై, **ఉత్తరం:** కామన్ కారిడార్ మరియు ఓపెన్ టు స్కై. 1200 చ.అ.ల విస్తీర్ణంలో ఉన్న నాలుగు సరిహద్దుల మధ్య, ఫ్లింత్ ఏరియా, కామన్ ఏరియా మరియు పార్కింగ్ ఏరియా, అన్ని సౌలభ్య హక్కులతో కలదు.

రిజర్వు ధర : రూ. 47,40,000/- (అక్షరాల నలభై ఏడు లక్షల నలభై వేల రూపాయలు మాత్రమే)
డిమాండ్ నోటీసు తేది: 17-10-2022, స్వాధీనత నోటీసు తేది: 24-02-2023.

విషయం: SARFAESI Act (Act 54 of 2002) క్రింద **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా** కు తనఖా పెట్టిన మీకు చెందిన పైన వివరించిన ఆస్థి బకాయి మొత్తము రాబట్టుటకు అమ్మకం జరుగుతుంది.
పై బ్యాంకు వారి ద్వారా 13(2) విభాగం క్రింద **డిమాండ్ నోటీసు** పంపినప్పటికీ మీరు బ్యాంకుకి చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో విఫలమైనారు.
పై చట్ట పరిధిలో సంక్రమించిన అధికారాలతో, పై ఆస్థిని స్వాధీనపరచుకోవడమైనది. ఆస్థిని స్వాధీనం చేసుకొన్నప్పటికీ, **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బెంజ్‌సర్కిల్ శాఖ** కు మీరు బకాయి పడిన మొత్తమును చెల్లించలేదు.
అందువలన ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 30 దినముల తర్వాత పై ఆస్తులను బహిరంగ ఇ-వేలం ద్వారా **రిజర్వు ధర** కు గాని అంతకంటే ఎక్కువకు గాని విక్రయించబడును.
వేలం తేదీ, సమయం మరియు సర్వీస్ ప్రొవైడర్ వివరములు అమ్మకం ప్రకటన ద్వారా విడిగా జారీచేయబడును మరియు అత్యధిక ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తిని విక్రయించబడును. ప్రైవేట్ అమ్మకం లేదా కొటేషన్ పొందడం ద్వారా ఎవరైనా వ్యక్తులకు ఆస్తిని విక్రయించే ప్రతిపాదన మీకు ఏదైనా ఉన్నచో, ఆ విషయమును లెటర్ / ప్రకటన స్వీకరించిన తేది నుండి 07 దినములలోగా మాకు తెలియపరచవలెను. మీరు అట్లు తెలియపరచినచో మీకు అటువంటి ప్రతిపాదన ఏది లేదని భావించి, పైన సూచించిన విధంగా ఇ-వేలం ద్వారా సదరు ఆస్థిని విక్రయించుటకు సిద్ధపడి తదుపరి చర్యలు తీసుకోబడును. ఇంకనూ మీరు చెల్లించవలసిన బకాయి మొత్తంతో పాటు తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతరత్రా వ్యయములు **పైన తెలిపిన డిమాండు నోటీసు** తేదిలలో సూచించబడినవి. అమ్మకం కొరకు నిర్ధారించిన తేదీ లోగా చెల్లించనిచో, ఇందు షెడ్యూలులో తెలిపిన ఆస్థిపై అమ్మకమునకు సంబంధించి తదుపరి చర్యలు తీసుకోబడవని ఇందుమూలముగా మీకు సూచించడమైనది. (సెక్షన్ 13 (8) చట్టం ప్రకారం విడిపించుకునే హక్కు కలదు).

తేది : 06-04-2023
ప్రదేశం : విజయవాడ
సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అంబేద్కర్ పుట్టినరోజు

పిల్లలూ, ఈ రోజు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి. అంబేద్కర్ అసలు పేరు భీంరావ్ రాంజీ అంబేద్కర్. 1891, ఏప్రిల్ 14న అప్పటి సెంట్రల్ ప్రావిన్సెస్‌లో సైనిక స్థావరమైన 'మౌ' అన్న ఊరిలో (ఇప్పటి మధ్యప్రదేశ్‌లో) రాంజీ మలోజీ సాక్పాల్, భీమాబాయ్ దంపతులకు 14వ సంతానంగా జన్మించారు. ఈయన ఆరేళ్ళ వయసులోనే అశ్రద్ధ, అవగాహన లేకపోవడం, ఆర్థిక కష్టాల కారణంగా తల్లి చనిపోయింది. మొత్తం 13 మంది తోబుట్టువులలో తొమ్మిది మంది అకాల మృత్యువాత పడగా ఇద్దరు అక్కలు – మంజుల, తులసి, ఇద్దరు అన్నలు– బలరాం, ఆనందరావు మిగిలారు.

అంబేద్కర్ చిన్నతంలోనే అంటరానితనాన్ని ఎదుర్కొన్నారు. తనను పాఠశాల గదిలో ఒక మూల కూర్చోబెట్టేవారు. నీళ్ళు తాగాలంటే కుండను తాకకుండా ప్యూన్ వచ్చి ఇచ్చేవాడు. అతను లేకపోతే పిల్లలు నీళ్ళు తాగే అవకాశం ఉండేది కాదు.

బి.ఎ. పట్టభద్రుడైన వెంటనే బరోడా సంస్థానంలో ఉద్యోగం లభించింది. కాని పైచదువులు చదవాలన్న పట్టుదల వల్ల ఉద్యోగంలో చేరలేదు. విదేశంలో చదువు పూర్తిచేసిన తరువాత బరోడా సంస్థానంలో పదేళ్ళు పనిచేసే షరతుపై రాజాగారి ఆర్థిక సహాయం అందుకొని కొలంబియా విశ్వవిద్యాలయంలో చేరారు. రెండేళ్లలో ఎం.ఎ., పి.హెచ్.డి. పట్టాలను పొందారు. ఆనాటి సిద్ధాంత వ్యాసమే పదేళ్ళ తర్వాత 'ది ఎవల్యూషన్ ఆఫ్ ప్రొవిన్షియల్ ఫైనాన్సస్ ఇన్ ఇండియా' అనే పేరుతో ప్రచురితమైంది.

తరువాత కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి పి.హెచ్.డి., లండన్ విశ్వవిద్యాలయం నుంచి డి.ఎస్.సి (డాక్టరేట్) పట్టాలను పొంది చాలా అరుదైన గౌరవాన్ని సంపాదించారు. న్యాయ, సామాజిక, ఆర్థిక శాస్త్రాలలో పరిశోధనలు చేశారు. మొదట్లో న్యాయవాదిగా, అధ్యాపకుడిగా, ఆర్థికవేత్తగా పనిచేశారు. తరువాత భారతదేశ స్వాతంత్ర్యం, పత్రికల ప్రచురణ, దళితుల సామాజిక రాజకీయ హక్కులు, భారతదేశ రాజ్యాంగ వ్యవస్థాపన కోసం కృషి చేశారు. 1956 డిసెంబరు 6న ఆయన మరణించారు. మన దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను ఆయన మరణాంతరం ప్రకటించారు.

చుక్కలు కలపండి



చిన్నారులూ , ఇక్కడ అంకెలు, సంఖ్యల దగ్గర చుక్కలను ఒకదాని తర్వాత ఒకటి కలపండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.

నేను గీసిన బొమ్మ

- శ్రీజ,
6వ తరగతి,
రాయిలాపూర్,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మెరిసిన గుజరాత్ బౌలర్లు

పంజాబ్ కింగ్స్‌పై ఆరు వికెట్ల తేడాతో గెలుపు

మొహాలీ : ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) గురువారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్ విజయం సాధించింది. తొలుత బౌలర్లు రాణించడంతో పంజాబ్ కింగ్స్‌ను 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 153పరుగులకే పరిమితం చేసిన గుజరాత్.. ఆ తర్వాత 19.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 154పరుగులు చేసి గెలిచింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ కింగ్స్‌ను గుజరాత్ బౌలర్లు మోహిత్ శర్మ(2/18), రషీద్ ఖాన్(1/26)కి తోడు జోసెఫ్, లిటిల్ కట్టు దిట్టంగా బౌలింగ్ కట్టడి చేశారు. కోల్‌కతా నైట్‌రైడర్స్ చేతిలో అనూహ్య పరాజయాన్ని చవిచూసిన గుజరాత్ టైటాన్స్... నేటి మ్యాచ్‌లో సమిష్టిగా రాణించింది. పంజాబ్ కింగ్స్ ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్ సింగ్ డకౌట్ కాగా.. కెప్టెన్ ధావన్(8) తక్కువ స్కోర్‌కే పెవీలియన్‌కు చేరాడు. ఆ తర్వాత షార్ట్(36), జితేశ్ శర్మ(25), సామ్ కర్రన్(22), షారుక్ ఖాన్(22), రాజపక్సె(20) ఫర్వాలేదనిపించారు. పంజాబ్ జట్టు రెండు మార్పులతో బరిలోకి దిగింది. నాథన్ ఎల్లీస్, సికిందర్ రాజా స్థానంలో భానుక రాజపక్సె, రగిసో రబడా తుది జట్టులో చోటు దక్కించుకున్నారు. ఛేదనలో గుజరాత్ ఓపెనర్లు సాహా(30), శుభ్‌మన్(67)) బ్యాటింగ్‌లో రాణించారు. వీరిద్దరూ కలిసి తొలి వికెట్‌కు 48పరుగులు జతచేశారు. ఆ తర్వాత సుదర్శన్(19) కెప్టెన్ హార్దిక్ పాండ్యా(8) నిరాశపరిచినా.. డేవిడ్ మిల్లర్(17), తెవాటియా(5) మరో వికెట్ పడకుం డా మ్యాచ్‌ను ముగించారు. ఆర్ష్‌దీప్, రబడా, హర్మన్‌ప్రీత్, కర్రన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మోహిత్ శర్మకు లభించింది.

ఐపిఎల్‌లో నేడు..
కోల్‌కతా × హైదరాబాద్
(వేదిక: కోల్‌కతా; రా.7.30గం॥లకు)

అమన్‌కు స్వర్ణం

ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్

అస్తానా(కజకిస్తాన్): ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పురుషుల 57కిలోల విభాగంలో భారత యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. గురువారం జరిగిన ఫైనల్లో అమన్ 9–4పాయింట్ల తేడాతో స్మాన్బెకోవ్(కజకిస్తాన్)పై సంచలన విజయం సాధించాడు. సీనియర్ విభాగంలో అమన్‌కు స్వర్ణ పతకం లభించడం ఇదే తొలిసారి. సెమీఫైనల్లో అమన్ 7–1పాయింట్ల తేడాతో జపాన్‌కు చెందిన రికూటో అరాయ్‌పై, క్వార్టర్స్‌లో చైనాకు చెందిన వాన్పోపై 7–4పాయింట్ల తేడాతో గెలిచి స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించాడు. సెహ్రావత్ గత ఏడాది జరిగిన అండర్–23 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్ కూడానూ. ఇక దీపక్ కుకున్నా(79కిలోలు), దీపక్ నెహ్రా(97కిలోలు) కాంస్య పతకాలు సాధించగా.. అనుజ్ కుమార్(65కిలోలు), ములాయమ్ యాదవ్(70కిలోలు) సెమీస్‌లో ఓడి పతక పోటీకి అర్హత సాధించలేకపోయారు. దీంతో ఈ టోర్నమెంట్‌లో భారత్‌కు మొత్తం 12పతకాలు దక్కాయి. ఇక గ్రీకో రోమన్ మహిళల రెజ్లింగ్‌లో ఏడు కేటగిరీల్లో భారత్‌కు నాలుగు పతకాలు దక్కాయి.

ముంబైలో 'ఓజీ' షూటింగ్



పవన్ అభిమాలు ఆసక్తితో ఎదురు చూస్తున్న ప్రాజెక్ట్ 'ఓజీ'. సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సినిమాపై క్రేజ్ పెంచేలా ప్రీ లుక్ పోస్టర్ ఉంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ సినిమా ఏప్రిల్ 16 నుంచి షూటింగ్ జరుపుకుంటున్నట్లు సమాచారం. ముంబైలో తొలి షెడ్యూల్‌ను ప్రారంభించనున్నట్లు మేకర్స్ తెలిపారు. గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ సినిమాకు ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్ అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. దానయ్య ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.

भारत 2023 INDIA
भारत सरकार
आज़ादी का अमृत महोत्सव

డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి

జయంతి సందర్భంగా (రాష్ట్రీయ సమ్రస్తా దివస్) జాతి వీరికి నివాళి అర్పిస్తుంది

పంచతీర్థంగా వీరి జీవితంకు సంబంధించిన ప్రదేశాలను అభివృద్ధిచేయుట ద్వారా బాబాసాహెబ్‌కు శ్రద్ధాంజలి అర్పిద్దాం

జన్మభూమి, మ్హౌవ్, మధ్య ప్రదేశ్ | డా॥ అంబేద్కర్ స్మారకం, లండన్ | చైత్య భూమి, దాదర్, ముంబయి
డా॥ అంబేద్కర్ జాతీయ స్మారకం, 26 అలిపూర్ రోడ్, ఢిల్లీ | దీక్ష భూమి, నాగపూర్

సాంఘిక–ఆర్థిక రంగాలలో పరిశోధనను సిఫారసుచేయుటకు ఢిల్లీ లో డా॥ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంను ప్రపంచ స్థాయిలో స్థాపన.

భారత ప్రభుత్వం బాబాసాహెబ్ కళల ప్రకారం భారత దేశంతోసహా నిర్మించుట.

- ఎసి, ఎస్‌టి మరియు ఓబిసిలు ప్రయోజనం పొందుటకు ఏదైతే 51% వారికి **ప్రధాన మంత్రి ముద్ర యోజన** క్రింద **40 కోట్ల ఖాతాల**కుగాను **రూ.23 లక్షల కోట్ల** విలువగల ముద్ర రుణాలు పంపిణీచేయబడినవి.
- ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద **3.11 కోట్ల మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు** ఉచిత గ్యాస్ కనెక్షన్లు పొందారు.
- **ప్రధాన మంత్రి ఉజ్వల యోజన** క్రింద **1 కోటి 10 లక్షల మించిన** ఎస్‌సి మరియు ఎస్‌టి లబ్దిదారులకు నిజమైన శాశ్వత ఇంటి కళను సార్ధకంచేయబడినది.
- **'మేక్ ఇన్ ఇండియా'** మరియు **'స్వయం సహాయక భారత్'** వంటి విప్లవాల్లతో పరిశ్రమలు మరియు స్వయం సహాయకత అనునది బాబాసాహెబ్ కళ.
- దేశంలోని **112** ప్రోత్సాహక జిల్లాలు అభివృద్ది ప్రమాణాలపై వారి రాష్ట్రాల సరాసరిగా ఆశ్చర్యం ద్వారా భారత అభివృద్ధి ప్రయాణంలో గట్టి భాగస్వామ్యులుగా ముందుకు వచ్చారు.
- సంఘాలలో గౌరవంగా జీవనం కల్పించుటకు, **ఎస్‌సి మరియు ఎస్‌టి** (అంటరానితనం రూపుమార్పు) చట్టం పటిష్టపరుచుట జరిగింది.
- వెనుకబడిన తరగతి గల 11 కోట్లకు మించిన విద్యార్థులు విద్య మరియు వారి నైపుణ్యం పెంపు **కల్పించుట ద్వారా రూ.36 వేల కోట్ల** కు మించిన మొత్తాలతో ప్రయోజనం కల్పించుట జరిగింది.
- **9 సం॥లలో** రెండింతలకు మించిన **ఎస్‌సి & ఎస్‌టి** విద్యార్థులకు ఉపకార వేతనాలు.

"బాబాసాహెబ్ కోరుకున్న విధంగా దళితులు, బధిరులు, అణగారిన, పీడిత ప్రజల సంక్షేమం కొరకు మన ప్రభుత్వం కృషి చేస్తున్నది. నిరుపేదల జీవితాల మెరుగు కొరకు అనేక పథకాలు అమలు చేయబడుచున్నవి మరియు సాంఘిక న్యాయం చేకూరుటకు అనేక ప్రమాణాలు కలిగియున్నాము."

నరేంద్ర మోడీ
ప్రధాన మంత్రి



cbc 38101/13/0001/2324

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68